

visit us @ http://epaper.suryaa.com

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com




సంపుటి 18 | సంచిక 210

శుక్రవారం | 23 మే 2025 | విజయవాడ | పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


**అనుగ్రహం**

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - వసంత ఋతువు, చైత్ర బహుళ ఏకాదశి సా.6.34, ఉత్తరాభాద్ర మ.12.29 వర్జ్యం రా.11.43 నుంచి 1.13 వరకు
రాహుకాలం ఉ.10.30 నుంచి 12.00 వరకు దుర్ముహూర్తం ఉ.8.09 నుంచి 8.59 వరకు తిరిగి మ.12.21 నుంచి 1.12 వరకు

## దాయాదిని మోకాళ్ల మీద

# కూర్చోబెట్టాం



- ఆపరేషన్ సిందూర్ విజయవంతం
- ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాం
- మన దళాల చక్ర వ్యూహాలతో శత్రువులు ఉక్కిరిబిక్కిరి
- మన మహిళల సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశాం
- సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశారు
- పహల్గామ్ ఉగ్ర దాడిపై మరోసారి మోడీ సీరియస్ కామెంట్లు

మన భద్రతా బలగాలు పాకిస్థాన్ను మోకాళ్లపై కూర్చోబెట్టాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ను ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్లో ఉగ్రవాదుల ఏరివేతకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్విస్తున్నారని రాజస్థాన్లోని బికనేర్లో మాట్లాడారు.మన మహిళల సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. మోడీ రాజస్థాన్లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బికనీర్లో ఏర్పాటు చేసిన సభలో పహల్గామ్ గురించి మాట్లాడుతూ.. పవర్ఫుల్ స్పీచ్ ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతం చేశామని తెలిపారు. కేంద్రం త్రివిధ దళాలకు పూర్తి స్వచ్ఛ ఇచ్చిందని గుర్తుచేశారు. మన దళాలు చక్ర వ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయని తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడికి జవాబుగా 22 నిమిషాల్లోనే ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు చెప్పారు.

వివరాలు లోపలి పేజీల్లో

## రైతులను నష్టపోనివ్వద్దు

- కేబినెట్ సబ్ కమిటీతో చర్చలు
- సీఎం చంద్రబాబు సమీక్ష

వరిసాగు, ఆయా పంటల సాగు ప్రణాళికలపై వ్యవసాయశాఖ అధికారులు దృష్టి పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. పంటలు, గిట్టుబాటు ధరలపై గురువారం సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. కేబినెట్ సబ్ కమిటీతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లు ఎలా ఉన్నాయో... ఏ పంటలు సాగుచేయాలో రైతులకు ముందే చెప్పాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.



2లో

## విశాఖలో 'కూటమి'కి బీటలు

7లో

## అగ్నివీరులు.. అంతా 20 ఏళ్ల లోపు వారే..

- కీలక సైనిక స్థావరాలను కాపాడిన యువ రక్తం..
- పాకిస్తాన్ దాడిని తిప్పికొట్టిన అగ్నివీరులు..
- ఆపరేషన్ సిందూర్‌తో సత్తా నిరుపించారు
- 3000 మంది అగ్నివీరులు పాల్గొన్నట్లు పేర్కొన్న రక్షణ శాఖ
- సర్వత్రా వీరి సేవలపై ప్రశంసల వర్షం



6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు

## రాజీవ్ యువ వికాసం





3లో

- జూన్ 02న సాంక్షన్ లెటర్స్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి సహకరించండి
- 12600 కోట్ల రూపాయలతో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించాం
- సామాజిక బాధ్యతను నెరవేర్చే క్రమంలో బ్యాంకర్లు ముందంజలో ఉండాలి
- రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్బీసీ) సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

### మీరు హద్దులు

## దాటుతున్నారు

ఈడీ దాడులపై తీవ్ర ఆగ్రహం




6లో

తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మద్యం సంస్థ టాస్మాక్పై చేస్తున్న ఈడీ దాడులపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సీరియస్ అయింది. ఈడీ అన్ని హద్దులు దాటిందంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది.

### అమృత్ భారత్


## రైల్వే స్టేషన్ల ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ
- 18 రాష్ట్రాల్లో ఆధునీకరించిన 103 అమృత్ రైల్వే స్టేషన్లు




వివరాలు లోపలి పేజీల్లో

## అంతా ఇంతే!




ఆపరేషన్ కగార్‌తో నక్సలైట్లను కూడా లేకుండా చేస్తున్నాం సార్

## గ్రామాలు కళకళ

- మన ఊరి కోసం మాటామంతీ లక్ష్యం
- ప్రభుత్వ నిధులే కాదు.. ప్రజల ఐక్యతతోనే గ్రామాలకు జీవం
- మాట్లాడుకుందాం.. చర్చిద్దాం... సమస్యను పరిష్కరించుకుందాం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



2లో

గ్రామాలను పట్టించుకోరు... అక్కడి మౌలిక సమస్యలు తీర్చరనే మాట ఇక వినపడకూడదనే ఆశయంతోనే మన ఊరి కోసం మాటామంతీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాము. కేవలం సమస్యల గురించి మాట్లాడుకోవడమే కాదు... గ్రామాల్లో ఉండే అన్ని విషయాలను అందరూ కూర్చొని మాట్లాడుకుంటూ గ్రామస్తులలో ఐక్యత తీసుకురావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ అన్నారు.

### సీఎంకు ఘన స్వాగతం

## పలుకుదాం

- సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి
- మంత్రి దామోదర్ రాజనర్సింహా



3లో

ఈనెల 23న సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి అయినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు.

### పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి

## హైకోర్టులో దక్కని ఊరట..




2లో

### అక్టోబర్‌లో విశాఖ

## మెట్రో పనులు

- 2026 ఏప్రిల్ నాటికి భోగాపురం పనులు పూర్తి
- మళ్లీ ఏపీకి అమృత్ నిధులు
- మంత్రి నారాయణ



2లో

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతోంది. ఈ సమయంలోనే అమరావతి పనులు ప్రారంభం కావటంతో.. ఇతర ప్రాంతాల పైన ప్రభుత్వం ఫోకస్ చేసింది.

### భూ విస్తీర్ణం, లావాదేవీలు బట్టి

## సర్వేయర్ల నియామకం

**ప్రతి మండలానికి 6 నుంచి 8 మంది**



3లో

- నక్షా లేని గ్రామాల్లో గ్రామసభలు పూర్తి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


తెలంగాణ రాష్ట్రంలో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా లైసెన్స్డ్ సర్వేయర్ల నియామకం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



## అక్టోబర్‌లో విశాఖ మెట్రో పనులు : మంత్రి నారాయణ

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతోంది. ఈ సమయంలోనే అమరావతి పనులు ప్రారంభం కావటంతో.. ఇతర ప్రాంతాల పైన ప్రభుత్వం ఫోకస్ చేసింది. అందులో భాగంగా కర్నూలుకు హైకోర్టు తరలింపు పైన కసరత్తు జరుగుతోంది. ఇక, విశాఖకు ప్రముఖ సంస్థలను తీసుకొచ్చేందుకు ప్రక్రియ వేగవంతం అయింది. తాజాగా విశాఖ కేం ద్రంగా మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించేందుకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. విశాఖలో మెట్రో ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. ఇందు కోసం ముహూర్తం ఫిక్స్ అయింది. విశాఖ మెట్రోకు సంబంధించి పనులు అక్టోబర్ నెలలో మొదలుపెట్టనున్నట్లు మంత్రి నారాయణ తెలి పారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణ పనులు 2026 ఏప్రిల్ నాటికి పూర్తవుతాయని స్పష్టం చేశారు. భోగాపురానికి అనుసంధానిస్తూ ప్రతిపాదించిన 22 రోడ్లలో 15 ఇప్పటికే పూర్తవుతున్నా యన్నారు. 115 రోజుల్లో మిగిలిన వాటికి సంబంధించిన ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తున్నా రన్నారు. జాతీయ రహదారి సంస్థతో సమన్వయం చేసుకుని నూతన రోడ్లు నిర్మిస్తామన్నారు. అదే విధంగా టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలంటే రూ. 7 వేల కోట్లు కావాలని వివరించారు. 2014- 2019 మధ్య 7 లక్షల టిడ్కో ఇళ్లు ప్రతిపాదించగా గత ప్రభుత్వం వల్ల అవి ఆగిపోయా యని ఆరోపించారు. కేవలం 2 లక్షల ఇళ్లు కూడా పూర్తి చెయ్యలేక పోయారన్నారు. ఎంత ఖర్చు అయినా లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించడానికి సీఎం చంద్రబాబు సంకల్పించార ని చెప్పారు. ఈ ఏట విజయదశమికి అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ ఇంటికి నీరిచ్చేలా 2021 లో అమృత్ పథకం కోసం కేంద్రం నిధులిస్తే వైఎస్సార్సీపీ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడటం వల్ల మళ్లీ అమృత్ నిధులు వచ్చాయన్నారు.


## పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హైకోర్టులో దక్కని ఊరట..




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డికి హైకోర్టులో బుగ్గ మఠం భూముల విషయంలో ఊరట లభించలేదు. దేవాదాయ శాఖ ఇచ్చిన నోటీసులపై ఏమైన అభ్యంతరాలు ఉంటే ఆ శాఖకు చెందిన అపిలేట్ ట్రిబ్యునల్‌కు వెళ్లాలని హైకోర్టు సూచించింది. కాగా, తిరుపతికి సమీపంలోని ఎంఆర్ పల్లిలో ఉన్న బుగ్గ మఠంకు చెందిన 3.88 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి కబ్జా చేసినట్లు అధికారులు గుర్తించారు. అయితే, ఆ భూములను ఖాళీ చేయాలని పెద్దిరెడ్డికి దేవాదాయ శాఖ నోటీసులు ఇచ్చింది. అయితే, బుగ్గ మఠం భూముల విషయంలో దేవాదాయ శాఖ జోక్యం చేసుకోకుండా స్టే ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పెద్ది రెడ్డి పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై విచారణ నిర్వహించిన హైకోర్టు.. దేవాదాయ శాఖ ఇచ్చిన నోటీసులపై అభ్యంతరాలు ఉంటే ఆ శాఖకు సంబంధించిన ట్రిబ్యునల్‌కు వెళ్లాలని సూచించింది.

# రైతులు నష్టపోకుండా చూడాలి

- కేబినెట్ సబ్ కమిటీతో చర్చలు
- సీఎం చంద్రబాబు సమీక్ష




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వరిసాగు, ఆయా పంటల సాగు ప్రణాళికలపై వ్యవసాయశాఖ అధికారులు దృష్టి పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. పంటలు, గిట్టుబాటు ధరలపై గురువారం సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. కేబినెట్ సబ్ కమిటీతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లు ఎలా ఉన్నాయో... ఏ పంటలు సాగుచేయాలో రైతులకు ముందే చెప్పాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. డిమాండ్ ఉన్న పంటలను మాత్రమే సాగయ్యేలా చూసి... రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. హెచ్డీ బర్లే పొగాకు మెట్రిక్ టన్నుకు రూ.12,000, కోకో కేజీకి రూ.500 ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. పొగాకు, కోకో పంటలను ఆయా కంపెనీలు కొనుగోళ్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

పంటకు మద్దతు ధర కన్నా తగ్గితే రైతులను నేరుగా ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. హెచ్డీ బర్లే - వైట్ బర్లే పొగాకును టొబాకో బోర్డులో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని చెప్పారు. రైతులు నష్టపోకుండా ఈ ఏడాది హెచ్డీ బర్లే పొగాకు రకానికి క్రాప్ హాలీడే ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్యూర్ జ్యూస్‌లపై జీఎస్టీ తగ్గింపునకు కృషి, మిడ్ డే మీల్స్, టీటీడీ ప్రసాదంగా మ్యాంగో జ్యూస్ ఇస్తున్నట్లు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## గ్రామాలు కళకళలాడాలన్నదే మన ఊరి కోసం

# మాటామంతీ లక్ష్యం

- ప్రభుత్వ నిధులే కాదు.. ప్రజల ఐక్యతతోనే గ్రామాలకు జీవం
- మాట్లాడుకుందాం.. చర్చిద్దాం... సమస్యను పరిష్కరించుకుందాం
- వినోదాన్ని పంచే వెండి తెర... సమస్యలను తీర్చే వేదిక కావడం గొప్ప అనుభూతి
- శ్రీకాకుళం జిల్లా, రావివలస పంచాయతీ గ్రామస్తులతో మన ఊరి కోసం మాటామంతీ కార్యక్రమం ద్వారా మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- రావివలస పంచాయతీకి రూ.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : గ్రామాలను పట్టించుకోరు... అక్కడి మౌలిక సమస్యలు తీర్చరనే మాట ఇక వినపడకూడదనే ఆశయంతోనే మన ఊరి కోసం మాటామంతీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాము. కేవలం సమస్యల గురించి మాట్లాడుకోవడమే కాదు... గ్రామాల్లో ఉండే అన్ని విషయాలను అందరూ కూర్చొని మాట్లాడుకుంటూ గ్రామస్తులలో ఐక్యత తీసుకురావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు అన్నారు. రెండు గంటలపాటు సమస్యలు, గ్రామాభివృద్ధి, ఇతర ముఖ్య విషయాల గురించి చర్చిస్తే దాదాపు రూ.15 కోట్ల విలువైన పనులు ఓ గ్రామానికి మంజూరు కావడం చిన్న విషయం కాదన్నారు. ప్రభుత్వం చేయాల్సిన పనులతోపాటు ప్రజా చైతన్యం వెల్లివిరిస్తేనే గ్రామాలు కళకళలాడుతాయని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో వినూత్నంగా నిర్వహించిన మన ఊరి కోసం మాటామంతీ కార్యక్రమాన్ని శ్రీ పవన్ కళ్యాణ్ గారు గురువారం ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా, టెక్కలి నియోజకవర్గం, రావివలస గ్రామపంచాయతీలోని గ్రామస్తులను టెక్కలిలోని సినిమా థియేటర్ కు తీసుకువెళ్లారు. మంగళగిరిలోని తన కార్యాలయం నుంచి శ్రీ పవన్ కళ్యాణ్ గారు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని వెండి తెర ద్వారా ప్రత్యక్ష ప్రసారంలో ఆ ఊరి ప్రజలతో అనుసంధానం అయ్యారు.

వారితో నేరుగా మాట్లాడుతూ గ్రామ సమస్యలను, అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

రావివలస పంచాయతీకి రూ.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరు చేశారు. 14 సీసీ రోడ్లు, 4 డ్రైనేజీలు, ఒక ధోబీ ఘాట్, ఒక బస్ షెల్టర్, స్కూల్ ప్రహరీ గోడ, ట్యాంక్ పునరుద్ధరణ, నీటి కాలువల పునరుద్ధరణ, శ్మశాన వాటికలలో సదుపాయాలు తదితర పనులకు నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ.... గ్రామాలకు నిధులు ఇస్తేనే అభివృద్ధి జరుగుతుందనే వాస్తవం కాదు. గ్రామస్తులంతా కలిసి ఐక్యంగా ముందుకు కదలితేనే ఎలాంటి సమస్య అయినా పరిష్కారం అవుతుంది. గ్రామాల్లో వృద్ధి పెరిగి, తరవాత ఉన్నత దశకు వెళ్లిన వారు కచ్చితంగా తమ సొంత గ్రామాన్ని మరవకూడదు. గ్రామాభివృద్ధిలో తగిన తోడ్పాటునందించాలి. గతంలో వినోదం కోసం మాత్రమే సినిమా థియేటర్లు ఉండేవి. ఇప్పుడు ఊరి సమస్యలను పరిష్కరించుకునే సామాజిక బాధ్యతకి వేదికలుగా నిలబడటం సంతోషకరం. వెండి తెర వేదికగా ప్రజలతో మాట్లాడటం గొప్ప అనుభూతి కలిగించింది.

**వెంటనే పరిష్కరించే ఏర్పాట్లు చేస్తున్నాం :** మన ఊరు మాటామంతీ కార్యక్రమం ద్వారా ప్రజలు చెప్పే సమస్యలు వెంటనే పరిష్కరించేవి ఉంటే పరిష్కరిస్తాం. సమయం తీసుకునేవి ఉంటే వాటిని పరిష్కరించే సమయం గ్రామస్తులకు తెలియపర్చడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. రావివలస గ్రామంలో స్వయంభువుగా నిలిచిన అతి పెద్ద లింగాకారం ఉంది. శ్రీ ఎండల మల్లికార్జున స్వామి లింగాకార రూపం అతి విశిష్టమైనది. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దడంపై అధికారులతో మాట్లాడి తగు ప్రణాళిక రూపొందిస్తాం. అలాగే రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వాటి విశిష్టతలు, గొప్పదనాలు ఉన్నాయి. వాటిని గుర్తించి తగు విధంగా వాటికి బ్రాండ్ తీసుకురాగలిగితే గ్రామాల రూపురేఖలు మారుతాయి.

**గ్రామ ఐక్యతే బలం :** గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలను తీర్చుకోవడానికి ఆ ఊరి ప్రజలు ఏకమైతే చేసుకునేవి కొన్ని ఉంటాయి. వాటిని గుర్తించి పరిష్కరించుకోవాలి. అలాగే గ్రామాల్లో పాఠశాలలను జాగ్రత్తగా కాపాడుకోవాలి. పాఠశాలలకు కేవలం బోధనకు మాత్రమే పరిమితం కావాలి. అక్కడ అసాంఘిక కార్యకలాపాలు, రాజకీయ, మతపరమైన సభలు జరపడానికి వీల్లేదు. అలాగే స్కూలు పిల్లలకు శారీరక దృఢత్వం అవసరం. పాఠశాలలకు కచ్చితంగా క్రీడా మైదానం ఉండాలి. దానికి ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. నేను గతంలో మైసూరవారిపల్లెకు వెళ్లినపుడు ఆ ఊరి ప్రజలు ఆటస్థలం కావాలని కోరారు. పంచాయతీ రికార్డుల్లో చూస్తే కనీసం ఆటస్థలానికి సెంటు భూమి లేదు. నా సొంత డబ్బుతోనే ఆటస్థలానికి కావల్సిన భూమి కొనుగోలు చేసి ఇచ్చాను. ప్రతిచోటా ఇలా నా సొంత డబ్బులను వెచ్చించాలంటే కష్టతరం అవుతుంది. కాబట్టి పంచాయతీలోని స్థలాలను పిల్లల ఆట స్థలాలుగా మార్చే ప్రక్రియ జరగాలి.


**డ్రైనేజీ ప్లాను లేకుండా లే అవుట్లను అనుమతించొద్దు :** గ్రామాల్లో లేదా కొత్తగా నిర్మితం అవుతున్న కాలనీల్లో కచ్చితమైన డ్రైనేజీ ప్లాను లేకుండా వాటిని అనుమతించకూడదు. దీనిపై నేను ముఖ్యమంత్రి గారితో, మంత్రివర్గ సహచరులతో మాట్లాడి దీనిపై ప్రత్యేక గైడ్ లైన్స్ తెచ్చేలా చూస్తాను. ముందుగా ప్లాన్ అప్రూవ్ అయిన తర్వాత డ్రైనేజీ ప్రణాళిక వేసే పద్ధతి కాకుండా, ముందుగా డ్రైనేజీపై స్పష్టత వచ్చిన తర్వాత లేఅవుట్లకు అనుమతించే పద్ధతి రావాలి. దీనిపై టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ శాఖ అధికారులతో చర్చిస్తాను. బెంగళూరు పరిస్థితి ఎలా ఉందో చూస్తున్నాం. సరైన డ్రైనేజీ అనుమతులు లేకుండా లే అవుట్లకు అనుమతి ఇస్తే భవిష్యత్తులో వాటి పరిస్థితి అగమ్యగోచరం అవుతుంది.

**ఉద్దానం పరిస్థితులు అన్ని చోట్లా వస్తున్నాయి :** భూగర్భ జలాల రక్షణ విషయంలో అందరికీ తగిన చైతన్యం రావాలి. ఉద్దానం కిడ్నీ సమస్యలు వంటివి రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో రావడం వెనుక భూగర్భ జలాలు అడుగంటిపోవడం కూడా ప్రధాన కారణం. 1000 మీటర్లు దాటి బోర్లు వేస్తే ఆ నీరు తాగడానికి పనికిరాకుండా పోతోంది. భూగర్భజలాలు దారుణంగా పడిపోతున్నాయి. వర్షపు నీటిని భూగర్భంలోకి పంపే చైతన్యం అందరిలో రావాలి. దీంతోపాటు డ్రైనేజీల్లో రక్షిత మంచి నీటి పైపులు చాలా చోట్ల కనిపిస్తున్నాయి. ఈ సమస్యపై ఎప్పటికప్పుడు స్థానిక అధికారులు దృష్టి సారించాలి. ఇటీవల గుర్లలో జరిగిన అతిసార ఘటనకు కూడా ఇలాంటి పరిస్థితే కారణం. తాగునీరు గ్రామీణ ప్రజలకు సమృద్ధిగా అందాలి.

**ఆడబిడ్డకు అన్యాయం జరిగితే యువత స్పందించాలి :** ఆడపిల్లలు, మహిళలపై ఎలాంటి నేరాలు జరగకుండా యువత బాధ్యత తీసుకోవాలి. ఏ ఆడపిల్లకు అన్యాయం జరిగినా మన ఇంట్లోని పిల్లగా భావించాలి. మన ఊరు మాటామంతీ కార్యక్రమం కేవలం సమస్యలను చెప్పుకోవడానికి మాత్రమే కాదు... ప్రభుత్వం మీ పల్లెగొంతు వినడానికి ఓ వారధిగా ఉపయోగించుకోండి. ఈ కార్యక్రమాన్ని మినీ గ్రామసభ అనుకోండి. ఇక్కడ గ్రామంలోని సమస్యలపై తీర్మానాలనే చేసుకునే గొప్ప కార్యక్రమంగా తీసుకోండి. వెనువెంటనే మీ తీర్మానాలు అందుకొని, వాటిని పరిష్కరించే గొప్ప కార్యక్రమంగా ఇది నిలిచిపోతుంది. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ దానిలో పాల్గొనాలి. యోగాను మన జీవిన విధానంలో భాగం చేసుకోవాలి. గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు యోగా డే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశాఖపట్నం వస్తున్నారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులతో చర్చించారు. యోగా సంబంధిత కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

## డిజిటల్ విధానంలో స్త్రీ నిధి రుణాల చెల్లింపులకు శ్రీకారం

### స్త్రీ నిధి యాప్‌ను ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : పేదరిక నిర్మూలనలో భాగంగా పేదల జీవనోపాధి అభివృద్ధికి అవసరమైన రుణాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న స్త్రీనిధి- ఆంధ్రప్రదేశ్, డిజిటల్ విధానం ద్వారా లబ్ధిదారులు రుణాలను చెల్లించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ, బ్యాంకుల మరియు ఇతర ఆర్థిక సంస్థలతో సహకరించి పేద మహిళలకు అవసరమైన రుణాలను మొబైల్ టెక్నాలజీ మరియు బయోమెట్రిక్ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా 48 గంటలలోపు అందించేందుకు స్త్రీ నిధి చర్యలు చేపట్టింది. ఈ రుణాల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయడానికి, ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శత కొరకు మరియు చెల్లింపుల భద్రతా కోణంలో లబ్ధిదారులు పురోగతిని సాధించడం కోసం స్త్రీనిధి మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా పేరుతో ఒక డిజిటల్ యాప్ ను రూపొందించినట్లు స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి రాష్ట్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు మరియు గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం () మంత్రి, కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నిర్వీర్యం అయిన సెర్ప్ విభాగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి అధికారులు చేస్తున్న కృషిని అభినందించారు. నిరక్షరాస్యత వలన గ్రామాల్లో మహిళలు తాము పొందిన రుణాలను తిరిగి సాంప్రదాయ పద్ధతిలో చెల్లింపులు జరపడం వలన చాలా రోజుల సమయం వృథా అవడంతో పాటు, ఆర్థిక లావాదేవీలపై అవగాహనా లోపం మరియు తాము ఎంత రుణాలను తిరిగి చెల్లించాము వంటి అంశాలపై స్పష్టత లేకపోవడం కారణంగా వారు మోసానికి గురికావచ్చు తద్వారా వారిపై మరింత ఆర్థిక భారం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ మహిళల ఆర్థిక పురోగతిని మరింత వేగవంతం చేయడం కోసం మరియు వారిని మైక్రో ఫైనాన్స్ భారిన పడకుండా కాపాడటం కోసం స్త్రీనిధి సంస్థ ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేయడం హర్షనీయంశం అని అన్నారు. డిజిటల్ విధానం లో స్త్రీ నిధి యాప్ ద్వారా చెల్లింపుల సౌకర్యాన్ని కల్పించడం ద్వారా లబ్దిదారులకు మేలు చేకూరుతుందన్నారు. అంతేకాకుండా సభ్యులు నేరుగా ఈ యాప్ ను వాడేందుకు వారికీ పూర్తి అవగాహన కల్పించే దిశగా స్త్రీనిధి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా యాప్ ను అమలులోకి తీసుకురావడానికి ఫండ్స్ ద్వారా సహకరంచిన బ్యాంకింగ్ భాగస్వాములను అభినందించారు. లావాదేవీలకు సంబంధించిన విషయంలో ఎలాంటి పొరపచ్చాలు జరగకుండా బ్యాంకు వారు జాగ్రత్త వహించాలని కోరారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సంస్థ, బ్యాంకు అధికారులు మరియు సభ్యుల మధ్యన యాప్ ను ప్రారంభించారు. భవిష్యత్తులో ఈ స్త్రీనిది యాప్ ను విజయవంతంగా ముందుకు తీసుకు వెళ్ళడానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ఒక స్వయం సహాయక సభ్యురాలు మంత్రిగారి ఆధ్వర్యంలో యాప్ ద్వారా ప్రత్యక్షంగా యాప్ డౌన్లోడ్, లాగిన్ ప్రక్రియ, చెల్లింపు లావాదేవీ చేసి చూపించడం జరిగింది. డిజిటల్ విధానంలో రీపేమెంట్ యాప్ తీస్కురావడాన్ని స్వాగతిస్తూ స్త్రీనిది సిబ్బందిని అభినందించారు. కార్యక్రమం లో భాగంగా యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీ భాస్కర్ రావు మాట్లాడుతూ డిజిటల్ పేమెంట్ యాప్ లో యూనియన్ బ్యాంకు ను భాగస్వామిగా చేసుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు. సెర్ప్ మరియు స్త్రీనిధి సంస్థలలో చోటు చేసుకుంటున్న విప్లవాత్మకమైన సాంకేతిక మార్పుతో గ్రామీణ మహిళలకు జరుగుతున్న ఆర్థిక మోసాలను అరికట్టవచ్చు అని తెలిపారు. అనంతరం సెర్ప్ సీఈఓ శ్రీమతి వాకాటి కరుణ ఐఏఎస్ మాట్లాడుతూ స్త్రీనిధి, సెర్ప్ సంస్థలో అంతర్భాగమని, గ్రామీణ మరియు పట్టణాలలో ఉన్న పేద మహిళల ఆర్థిక అభివృద్ధికి స్త్రీనిధి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి, సెర్ప్ విభాగాలకు చెందిన అధికారులు, బ్యాంకు అధికారులు మరియు స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

# ఈ ఏడాది సాగు సజావుగా సాగేనా?

- 1.34 కోట్ల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- వరి 66.80 లక్షల ఎకరాల్లో సాగు
- సాంకేతిక కారణాల వలన రైతు భరోసా అందని పరిస్థితి
- ప్రారంభం కాని విత్తన పంపిణీ
- రుణ ప్రణాళిక ఖరారైన ప్రారంభంకాని రుణాలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఈ ఏడాది నైరుతీ పవనాలు కేరళ తీరాన్ని సాధారణం కంటే ఐదు రోజుల ముందే తాకబోతున్నట్టు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ప్రకటించింది.జూన్ ఒకటిన రావాల్సిన పవనాలు ఈ నెల 27నే తీరాన్ని తాకనున్నట్టు ప్రకటించింది. తెలుగు రాష్ట్రాలులో జూన్ మొదటి వారంలోనే తొలకరి వర్షాలు పడతాయని ముందస్తు శుభవార్త అందించింది. ఈ సారి వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ మోసుకొచ్చిన చల్లని కబురు అన్నదాతల్లో ఆశలు చిగురింప జేసింది. గతేడాది అకాల వర్షాలు, నాసిరకం, కల్తీ విత్తనాలు, పంటలకు ధరలేమి ఇత్యాది సమస్యలన్నీ కట్టకట్టుకొని రైతులకు నష్టాలు మూటగట్టాయి. అప్పుల భారంతో ఎంతోమంది అన్నదాతలు తనువు చాలించారు. యాసంగి ,దాళ్వా చివరిలోనూ అకాల వర్షాలు కన్నీరు పెట్టించాయి.కొద్దిరోజులుగా ఎక్కడో చోట ఏదోమూల అకాల వర్షాలు పడుతూ రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనకంతంటికీ వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు ఒక బాగమైతే,పంటల కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం కూడా చాలా స్పష్టంగా కనిపించింది.ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతు వాటన్నంటినీ తట్టుకుని ముందుకు సాగుతున్నాడు.ఈమారైనా కాలం కలిసి వస్తుందని రైతులు రాబోవు వానాకాలం పంటపై ఆశలు పెట్టుకున్నారు. అందుకే విత్తనాలు జల్లేందుకు పంట పొలాలను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. గతం పునరావృతం కాకుండా రాష్ట్రప్రభుత్వం రుణాల మంజూరు,విత్తనాలు,ఎరువులు సిద్ధం చేసుకుని రైతులకు సకాలంలో అందించేందుకు ఏర్పాట్లు చేయాలి. సాంకేతిక కారణాలతో రైతు భరోసా, రుణమాఫీ సమస్య పూర్తి కాలేదు. లక్షల మంది ఎదురు చూస్తున్నారు.రైతు భరోసా సాయంపై అనుమానాలు అలానే ఉన్నాయి.విత్తనాలు,ఎరువులు కోసం ఎక్కడికి పోవాలన్నది ప్రశ్న.సర్కారులో అలాంటి సన్నద్ధత ఉందా.. వానాకాలం సాగు కోసం రాష్ట్రంలో కోటి 34 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించింది. అత్యధికంగా వరి 66.80 లక్షల ఎకరాల్లో సాగు కానుంది.

పత్తి 50 లక్షల ఎకరాల్లో సాగు చేయనున్నట్టు తెలిపింది.ఆ తర్వాత మిర్చి,వేరుశనగ,మొక్కజొన్న,సోయా బీన్,మినుములు,కంది,ఇతర ఉద్యానవన పంటలు వేయనున్నారు.సాగుకు తగినట్టుగా 16.70 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు,95 లక్షల పత్తి ప్యాకెట్లు,1.35 లక్షల క్వింటాళ్ల సోయాచిక్కుడు,తదితర పంటల విత్తనాలు అవసరమని భావించింది.విత్తన పంపిణీలో మాటలు ప్రతి ఏడాదీ కోటలు దాటుతున్నా,చేతలే గడప దాటట్లేదు.గతంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి విత్తనాల పంపిణీ జరిగేది.

ఇప్పుడు ప్రయివేటు కంపెనీల నుంచే ఎక్కువ భాగం అందుతున్నాయి.ముఖ్యమంత్రి, మంత్రులు,అధికారుల సమీక్షలు ఎలా ఉన్నా సకాలంలో రైతులకు విత్తనాలు,ఎరువులు అందవు.క్యూలో నిలబడలేక రైతులు తీవ్ర పాట్లు పడాల్సిన పరిస్థితులు చూశాం. విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పుకుంటున్నా నాసిరకం విత్తనాలను కొనుగోలు చేయాల్సిన అగత్యం ఏర్పడుతోంది.

దీన్ని అనువుగా చూసుకుని ప్రయివేటు వ్యాపారులు నకిలీ విత్తనాలను అంటకట్టడం వల్ల వేలాది రూపాయలు రైతులు నష్టపోవాల్సి వస్తోంది.నకిలీ విత్తనాలు కొని సాగు చేయడం వల్ల ఆ మొక్కలు తిని పశువులు చనిపోయిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో తాజాగా వెలుగు చూసింది.ఒరిస్సా,మహారాష్ట్ర,చుట్టు పక్కల రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రాష్ట్రంలో అడుగుపెడుతున్నాయి. అమ్మేవారిపై తప్ప నకిలీ విత్తనాలు తయారు చేస్తున్నవారిపై చర్యలు ఉండవు.ఈ విషయంలో కేంద్రం కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఏ భూమిలో ఏయే పంటలు సాగు యోగ్యమో రైతులకు వ్యవసాయశాఖ అవగాహన కల్పించాలి.ఏప్రిల్‌లోనే పరీక్షలు జరిపి మే నెలాఖరు నాటికి కార్డులు జారీ చేయాలని ఏండ్ల తరబడి అనుకుంటున్నా ముందుకు సాగడం లేదు. రైతు మహోత్సవాల పేరిట ఇటీవల సదస్సులు నిర్వహించినా ఉపన్యాసాలకే పరిమిత మయ్యాయి.దీనివల్ల రైతుకు అవగాహన కాలేదు.రైతు చేతిలో భూసార కార్డు ఉంటే తన పొలంలో ఏ పంట వేసుకోవాలి.ఎలాంటి ఎరువులను వాడాలన్నది తెలుసుకునేవాడు.పంటలు నష్టపోయిన రైతులు బీమా,ఇన్‌పుట్ సబ్సిడీల కోసం నిరీక్షిస్తున్నారు. ఇటీవల అకాల వర్షాలతో వెయ్యికోట్లకు వేగా నష్టం వాటిల్లినా,వాటికి ఇంతవరకూ నష్టపరిహారం అందించిన దాఖలాల్లేవు.ఖరీఫ్ ప్రారం భ వేళ రైతులను ముసురుకుంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలి.సాగునీటి విడుదల విషయమై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి.ఉత్తుత్తి మాటలు శుష్క వాగ్దానాలతో సమయాన్ని వృథా చేయకుండా సాగు సజావుగా సాగేందుకు సర్కార్ అవసరమైన అన్ని చర్యలూ యుద్ధప్రాతిపదికన చేపట్టాలి.

## అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

- వెయ్యి పింఛను పెంచడానికి జగన్‌కు ఐదేళ్లు పట్టింది
- పాస్ పుస్తకాల్లో జగన్ ఫొటోలు వేసి భూములు కొట్టేసే కుట్ర
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : అభివృద్ధి, సంక్షేమం రెండూ తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా అద్దంకిలో గురువారం జరిగిన మినీ మహానాడు కార్యక్రమంలో కార్యకర్తలను ఉద్దేశించి... టీడీపీ వచ్చిన తరువాతే ప్రపంచవ్యాప్తంగా తెలుగోడి గొప్పతనం తెలిసిందని భావోద్వేగంగా ప్రసంగించిన ఆయన.., గత ఐదేళ్ల వైసీపీ హయాంలో రాష్ట్రం నష్టపోయిన తీరును వివరించారు. వెయ్యి రూపాయిల పింఛను పెంచడానికి ఐదేళ్లు తీసుకున్న జగన్ మోహన్ రెడ్డికి కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. తాతలు, తండ్రులు ఇచ్చిన భూమి పట్టాదారు పాస్ పుస్తకాలపై రాజముద్రను తీసేసి తన ఫొటో వేయించుకుని భూములు కొట్టేసే కుట్ర జగన్ రెడ్డి చేశాడని ఆరోపించారు. ప్రభుత్వ భూమి కనబడితే వదలని వైసీపీ నేత.., కేవలం ఒక్క విశాఖ పరిధిలోనే 12,000 ఎకరాలను తన అనుయాయల పేరు మీద బదలాయించాడని మంత్రి విమర్శించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ఉన్నా..., పేదలకు సహాయం చేయడానికి కూడా మనస్కరించని వ్యక్తి.. గత ప్రభుత్వ వైసీపీ సీఎం అని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ పాలనతో.., రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని మంత్రి గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు.

**అత్యధిక సార్లు డిఎస్సీ నిర్వహించింది టీడీపీనే... :** కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ఓర్వలేని వైసీపీ నేతలు... సోషల్ మీడియాతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవి మండిపడ్డారు. ఒక్క సంతకంతో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల రూ.3 వేల పింఛన్ ను రూ.4 వేలకు ఒకేసారి పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.., దివ్యాంగుల మూడు వేల పింఛన్లను కూడా రూ.6 వేలకి పెంచారని గుర్తు చేశారు. అదే విధంగా గుండె మార్పిడి చికిత్సతో పాటు లివర్, కిడ్ని వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటూ... తీవ్ర అనారోగ్యంతో బాధ పడే వారికి ఒకేసారి రూ.5 వేల నుంచి... రూ.10 వేలు., పూర్తి అంగవైకల్యం, శాశ్వతంగా మంచానికే పరిమితమైన వారికి రూ.5 వేల నుంచి ఒకేసారి... నెలకు రూ.15 వేలకు పెంచి, పింఛన్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

మూడు ఉచిత సిలెండర్ల డబ్బును లబ్ధిదారుల అకౌంట్లలోకి జమ చేయాలని తాజాగా జరిగిన మంత్రి వర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు నిర్ణయించారని స్పష్టం చేశారు. అదే విధంగా అత్యధికంగా 8 సార్లు డిఎస్సీ నిర్వహించి వేలాది టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత కూడా తెలుగుదేశం సొంతమని మంత్రి గొట్టిపాటి వ్యాఖ్యానించారు. సంక్షేమ పెన్షన్ల కోసమే ఏడాదికి రూ.33 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్న రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటేనని ఆయన తెలిపారు.

ఎప్పుడు అధికారం వచ్చినా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ఆలోచించేది నారా చంద్రబాబు నాయుడు అయితే... అధికారం ఎప్పుడు వచ్చినా... రాష్ట్ర సంపదను దోచుకునేది వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. 16,500 టీచర్ పోస్టుల భర్తీతో పాటు తల్లికి వందనం, రైతులకు సహాయాన్ని కూడా అతి త్వరలోనే అందిస్తామని మంత్రి ప్రకటించారు. అదే విధంగా ప్రతి ఏడాదీ ఎన్టీఆర్ జయంతి రోజు మహానాడు జరుపు కోవడం ఆనవాయితీ అని చెప్పిన మంత్రి గొట్టిపాటి.., కార్యకర్త చంద్రయ్యను పార్టీ మారనందుకు అతి దారుణంగా హత్య చేశారని చెప్పారు. కూటమి అధికారం చేపట్టగానే చంద్రయ్య కుటుంబంలోని వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చిన తెలుగుదేశం పార్టీ తన నిబద్ధతను, కార్యకర్తలపై తన ప్రేమను మరోసారి అందరికీ గుర్తు చేసిందన్నారు.

**తెలుగోడి ఆత్మగౌరవం నుంచి పుట్టి...**

తెలుగు వారి ఆత్మ గౌరవం కోసం స్వర్గీయ ఎన్టీ రామారావు పెట్టిన తెలుగుదేశం పార్టీ... 40 సంవత్సరాల తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలకు వేదికగా మారిందని మంత్రి గొట్టిపాటి రవి గుర్తు చేశారు. అందరూ జొన్న అన్నం తినే సమయంలో తెలుగు ప్రజలందరూ వరి అన్నం తినాలన్న ఆశయంతో రూ.2 కిలో బియ్యం పథకాన్ని ఎన్టీఆర్ ప్రవేశ పెట్టారని తెలిపారు. అదే విధంగా తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన... మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పక్క గృహ నిర్మాణ పథకం, సంక్షేమ వసతి గృహాల ఏర్పాటు, బాలికల కోసం ప్రత్యేక విద్యాలయాల ఏర్పాటు వంటి ఆదర్శ పథకాలు దేశంలోని ఎన్నో రాష్ట్రాలు ఇప్పటికీ అమలు చేస్తున్నాయని మంత్రి చెప్పారు.

అదే విధంగా నారా చంద్రబాబు నాయుడు., ప్రజలందరినీ ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం సాఫ్ట్ వేర్ రంగాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. గోదావరి నీటిని పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు అందించడం, నాగార్జున సాగర్ జలాలను ప్రకాశం, రాయలసీమకు తేవడం వంటి వాటి ద్వారా నదుల అనుసంధానం చేసిన మొదటి ముఖ్యమంత్రి దేశంలో చంద్రబాబు ఒక్కరే అన్నారు. త్వరలో రూ.80 వేల కోట్లతో ఏర్పాటు చేయబోయే బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సస్యశ్యామలం అవుతాయని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అదే విధంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు బాకీ ఉన్న రూ.2 వేల కోట్ల ధాన్యం బకాయిలు కూటమి ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు.

## చంద్రబాబు హయాంలో లిక్కర్ స్కామ్

### ఎలా జరిగిందంటే... వైయస్ జగన్ వెల్లడి

- లిక్కరు షాపులకోసం నిర్వహించిన లాటరీని రిగ్గింగ్ చేశారు
- చంద్రబాబుకు చెందిన ఐదు కంపెనీలకు 69 శాతం అర్డర్లు లభించాయి
- దీనిపై నమోదయిన కేసు మీదనే బెయిల్ పొందారు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో లిక్కర్ స్కామ్ ఎలా జరిగిందో మాజీ సీఎం, వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ వివరించారు. తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో సమావేశంలో ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. అసలు నిజమైన స్కామ్ స్టర్ ఎవరూ?..చంద్రబాబు కాదా? 20142019 మధ్య చేసిన లిక్కర్ స్కామ్‌లో చంద్రబాబు బెయిల్‌పై లేడా? ఇది వాస్తవం కాదా? ఆ రోజు చంద్రబాబు చేసిన స్కామ్ చెబుతా చూడండి. రాష్ట్రంలో 4380 లిక్కర్‌షాపుల కోసం నిర్వహించిన లాటరీ ప్రక్రియను రిగ్గింగ్ చేశారు. తన ఎమ్మెల్యేలు, తన మంత్రులు, తన బినామీలు రిగ్గింగ్ చేసి తన మనుషులకు షాపులు ఇప్పించుకున్నారు. ఈ షాపులన్నింటిని ఒక సిండికేట్ మాఫియాగా తయారు చేశారు. వీటికి పక్కనే ఇల్లీగల్‌గా పర్మిట్ రూమ్‌లు, 40 వేల బెల్ట్‌షాపులు నడిపారు. ఎక్కువ రేటుకు మద్యాన్ని అమ్మారు. అప్పుడు కూడా ఇలాగే ప్రైవేట్‌షాపుల సిండికేట్, ఈయనకు కావాల్సిన డిస్టలరీలకు మేలు చేసే విధంగా ఆర్డర్స్ చేశారు. తనకు కావాల్సిన కంపెనీలతో ఇండెంట్ ఇప్పించారు. 2015 2019 మధ్యలో చంద్రబాబు ఐదు కంపెనీలకు 69 శాతం ఆర్డర్స్ దక్కాయి. కొన్ని బ్రాండ్లకు కృత్రిమ డిమాండ్లు సృష్టించారు. 2014 నవంబర్‌లో జీవో 993 ప్రకారం రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్స్ బేఖాతర్ చేస్తూ డిస్టలరీల కెపాసిటీ కొన్నింటికి ఎక్స్‌క్యూజివ్‌గా చంద్రబాబు రెకమెండ్ చేశారు. తరువాత 2012 నుంచి అమలులో ఉన్న ప్రివలేజ్ ఫీజును తొలగించి చంద్రబాబు తన ప్రైవేట్ షాపుల మాఫియాకు లబ్ధి చేకూర్చారు. 2015 డిసెంబర్ 11న జీవోను విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన నోట్‌ఫైల్‌లో స్వయంగా చంద్రబాబే సంతకం చేశారు. మూడుసార్లు చంద్రబాబు సంతకం చేసి విత్ అవుట్ కేబినెట్ అప్రూవల్ లేకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేకూర్చుతూ చంద్రబాబు సంతకం చేసిన ఫైల్‌ను కాగ్ కూడా తప్పు పట్టింది. ఇవన్నీ ఉన్నా నేపథ్యంలో చంద్రబాబుపై బలమైన కేసు నమోదు అయ్యింది. చంద్రబాబు ఆ కేసుపై ఇప్పుడు బెయిల్‌పై ఉన్నాడు. ఆయనపై అప్పట్లో వచ్చిన ఆరోపణలు వచ్చిన దానిపై ఇప్పుడు వైయస్ఆర్‌సీపీపై ఫాల్స్ కేసు ఫైల్ చేయించారు. అదే తన పాత పాలసీ ప్రకారం స్కామ్ చేసుకునేందుకు మధ్యలో వైయస్ఆర్‌సీపీపై స్కామ్ జరిగినట్లు చూపించే ప్రయత్నం చేస్తున్నారని వైయస్ జగన్ వివరించారు.



## వరల్డ్ క్లాస్ విధానాలతో తెలంగాణ జూ పార్కులు నడపాలి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రపంచ స్థాయి విధానాలను అవలంభించి రాష్ట్రంలోని జూ పార్కులను నడపాలని తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్రంలోని జూ పార్కుల్లో జంతువుల పరిరక్షణకి ప్రత్యేక చర్యలు అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని అన్ని జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కులను మెరుగైన సౌకర్యాలతో తీర్చిదిద్దాలని మంత్రి సురేఖ చెప్పారు. జూలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే... సందర్శకులు పెద్ద సంఖ్యలో వస్తారని అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం కాన్ఫరెన్స్ హాలులో మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (జపాట్) 14వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణ (హెచ్ఓఎఫ్ఎఫ్), చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏలుసింగ్ మేరు, సిసిఎఫ్ లు ప్రియాంక వర్గీస్, రామలింగం, డైరక్టర్ జూ పార్క్స్ సునీల్ ఎస్. హేరామత్, పలువురు డిఎఫ్ఓలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, సందర్శకుల అభిరుచుల మేరకు, పర్యావరణానికి ఏమాత్రం ఇబ్బంది కలగకుండా, అటవీశాఖకు ఆదాయం సమకూరే విధంగా పకడ్బందీ ప్రణాళికలతో జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పనిచేయాలని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా జూ పార్కుల్లో అవలంబిస్తున్న విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని నెహ్రూ జూ పార్క్, కాకతీయ జూ పార్క్, పిల్లలమర్రి మినీ జూపార్క్, లోయర్ మానేరు డీర్ పార్క్, కిన్నెరసాని డీర్ పార్క్ జంతు సంరక్షణ చర్యలు, కేబీఆర్, మృగవని, మహవీర్ హరిణ వనస్థలి, ఇతర అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో సందర్శకుల సంఖ్య పెరిగినట్లు అధికారులు మంత్రికి వివరించారు. అయితే, సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని చెప్పారు. అదనపు సౌకర్యాలపై దృష్టి సారించాలని, అందుకు సంబంధించిన అంశాలపై మంత్రి, శాఖ ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. కాగా, గత ఏడాది జూ పార్కుల తాలుకూ నిర్వహణ బడ్జెట్ అనుమతులను మంత్రి నుంచి అధికారులు తీసుకున్నారు.

### 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు

# రాజీవ్ యువ వికాసం

● జూన్ 02న సాంక్షన్ లెటర్స్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి సహకరించండి ● మానవ వనరుల అభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి సారించిన ప్రజా ప్రభుత్వం ● వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ వైపు దేశం మొత్తం చూస్తున్నది ● 12600 కోట్ల రూపాయలతో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించాం ● సామాజిక బాధ్యతను నెరవేర్చే క్రమంలో బ్యాంకర్లు ముందంజలో ఉండాలి ● రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్బీసీ) సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఉద్యోగ అవకాశాలు రానటువంటి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి రాష్ట్రంలో ఐదు లక్షల మందికి రాజీవ్ యువ వికాస పథకం సాంక్షన్ లెటర్స్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం జూన్ 02న అందించాలని ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి బ్యాంకర్లు సహకరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. గురువారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హైదరాబాదులో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ ఎల్ బి సి) సమావేశంలో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. విద్యా బుద్దులు నేర్చిన మానవ వనరులు ఖాళీగా ఉండటం వల్ల లాభం కంటే, సమాజానికి నష్టమే ఎక్కువగా ఉంటుందని, ఆ నష్టం జరగకుండా ఉండాలని వారి మేధస్సును ఉత్పత్తి రంగంలో వినియోగించి జిడిపి కి పెద్ద ఎత్తున ఉపయోగం ఉండే విధంగా రాజీవ్ యువ వికాస పథకం తీసుకువచ్చామని వివరించారు. ఐదు లక్షల మంది యువతకు 9 వేల కోట్ల రూపాయలు సాయం చేసే పథకం దేశ చరిత్రలో ఏ రాష్ట్రం కూడా తీసుకురాలేదని అన్నారు. పెద్ద ఎత్తున తీసుకొస్తున్న ఈ పథకాన్ని మంచి మనసుతో బ్యాంకర్లు ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. రాజీవ్ యువ వికాస పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 6,250 కోట్ల రూపాయలు సబ్సిడీ రూపేణా ఇస్తున్నదని తెలిపారు. గతంలో యువతకు స్వయం ఉపాధి కింద రుణాలు ఇచ్చే సమయంలో 70 శాతం రుణం, 30 శాతం సబ్సిడీ ఉండేదని ఇప్పుడు ఇది రివర్స్ గా ఉందన్న విషయాన్ని బ్యాంకర్లు గ్రహించాలన్నారు. 8 లక్షల కోట్ల రూపాయల పైబడి లక్ష్యంగా పెట్టుకున్న వార్షిక రుణ ప్రణాళికలో రాజీవ్ యువ వికాస పథకం కోసం బ్యాంకర్లు 0.2 శాతం మాత్రమే వెచ్చించాల్సి ఉంటుందన్నారు. చదువుకునే ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్మెంట్ ఇచ్చి ప్రజా ప్రభుత్వం బాగా చదివిస్తున్నారు. తద్వారా విద్యలో నైపుణ్యం కలిగిన యువత ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని చెప్పారు. ఉద్యోగ అవకాశాలు రాని వారి మేధస్సును కూడా ఈ సమాజానికి వాడాలని వారి మేధస్సును వ్యాపారంలో కానీ ఉత్పత్తి రంగంలో వాడితే ఆ సమాజానికి మంచి మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ మంత్రిమండలి ఆలోచన చేసి యువత కోసం ఈ పథకం తీసుకొచ్చామని వివరించారు. జూన్ 02న 5 లక్షల మంది యువతకు సాంక్షన్ లెటర్స్ పంపిణీ చేయాలన్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రత్యేక నోడల్ అధికారిని ఎస్ఎల్బీసీ కన్వీనర్ నియామకం చేయాలని కోరారు. ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో అన్ని బ్యాంకుల తో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర స్థాయి నోడల్ అధికారి పర్యవేక్షించాలని సూచించారు.

**మానవ వనరులపై ప్రత్యేక దృష్టి**

తెలంగాణ రాష్ట్రంలో మానవ వనరులను అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ముందుకు వెళుతున్నదని చెప్పారు. ఇందుకోసం రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్య పైన పెద్ద ఎత్తున దృష్టి సారించి స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు ప్రొఫెషనల్ కాలేజీల్లో చదివే ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్మెంట్ ఇస్తూ విద్యావంతులైన మానవ వనరులను పెద్ద ఎత్తున ఈ సమాజానికి ఇవ్వడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని వెల్లడించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రం వైపు దేశం మొత్తం చూస్తున్నదన్నారు. అభివృద్ధికి కావలసిన ఇంఫ్రాస్ట్రక్చర్ను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నదని చెప్పారు.

**వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత**

ప్రజా ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని ఇందులోనూ ఉద్యానవన పంటలకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్రానికి కూడా డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆయిల్ ఫామ్ పంటలకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులో ఉదారంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారంగా రెండు లక్షల రుణాలు ఉన్న రైతులందరికీ ఏకకాలంలో 21 వేల కోట్ల రూపాయలను బ్యాంకుల్లో జమ చేశామని గుర్తు చేశారు. పెట్టుబడి సహాయంగా రైతులకు రైతు భరోసా అందిస్తున్నామని రైతు బీమా ప్రీమియం డబ్బులను కూడా ప్రభుత్వమే చెల్లిస్తున్నదని తెలిపారు.



**12600 కోట్లతో ఇందిరా సౌర గిరి జల వికాసం**

అడవిలో అనాదిగా ఇబ్బందులు పడుతున్న అడవి బిడ్డల జీవన ప్రమాణాలు పెంచడానికి లక్ష్యంగా పెట్టుకొని ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొంది ఉన్న ఆరు లక్షల 70 వేల ఎకరాలను సౌర విద్యుత్తు ద్వారా సాగులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం 12,600 కోట్ల రూపాయలను కేటాయించామని వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ ఏడాది వడ్డీ లేకుండా 20 వేల కోట్లకు పైగా రుణాలు ఇచ్చామని, రానున్న నాలుగు సంవత్సరాల్లో లక్ష కోట్ల రూపాయలు రుణాలు ఇచ్చే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడమే కాకుండా రకరకాల వ్యాపారాలు చేసుకోవడానికి కావలసిన మార్గాలను కూడా ప్రభుత్వమే వారికి చూపిస్తున్నదని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్టీసీ లో అద్దె బస్సులు పెట్టుకోవడానికి సహకారం అందిస్తున్నామని, అదేవిధంగా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసుకోవడానికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో న్యూ ఎనర్జీ పాలసీ తీసుకువచ్చి 2030 సంవత్సరం నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్ మహానగరంలో మూసి పునర్జీవం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నదని వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన అనేక రకాలైన క్లస్టర్ తో పరిశ్రమల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2025–26 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సామాజిక బాధ్యతను నెరవేర్చే క్రమంలో బ్యాంకర్లు ముందంజలో ఉండాలని సూచించారు. ప్రభుత్వాలు బ్యాంకింగ్ రంగం రెండు కలిసి సామాజిక బాధ్యతను నెరవేర్చడానికి ముందుకు వెళితే సమాజంలో అశాంతి లేకుండా ఉంటుందన్నారు. సమాజం శాంతియుతంగా ఉంటేనే అభివృద్ధి ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్ శ్రీధర్, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్, బీసీ వెల్ఫేర్ సెక్రెటరీ శ్రీధర్, ఆర్బిఐ రీజినల్ డైరెక్టర్ చిన్మోయ్ కుమార్, నాబార్డ్ సీజీఎం ఉదయ్ భాస్కర్, ఎస్బిఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ కుమార్, ఎస్ ఎల్ బి సి కన్వీనర్ ప్రకాష్ చంద్ర పాల్గొన్నారు.

### తెలంగాణలో మూడు రైల్వే స్టేషన్లను

## ప్రారంభించిన ప్రధాని మోడీ



వరంగల్ : తెలంగాణలో మూడు రైల్వే స్టేషన్లను వర్చువల్ గా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,ఈరోజు ఉదయం ప్రారంభించారు. అమృత్ భారత్ స్కీములో భాగంగా అభివృద్ధి పరిచిన వరంగల్, కరీంనగర్, బేగంపేట్, రైల్వే స్టేషన్ ను గురువారం పునః ప్రారంభించారు. దేశవ్యాప్తంగా రీ డెవలప్ చేసిన 103 అమృత్ భారత్,రైల్వే స్టేషన్లను జాతికి అంకితం చేశారు. రాజస్థాన్ లో ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్ డెవలప్మెంట్ కార్యక్రమానికి హాజరైన ప్రధాని దేశవ్యా ప్తంగా అన్ని స్టేషన్లను ఒకేసారి వర్చువల్ గా ప్రారంభించారు. వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం 25..41 కోట్ల నిధులతో అమృత భారత్ పథకం కింద వరంగల్ రైల్వే స్టేషన్ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అంతర్జా తీయ ప్రమాణాలకు దీటు గా వరంగల్ రైల్వే స్టేషన్ రూపుదిద్దారు. కాకతీయుల కలలు. స్టేషన్లో ప్రయాణికు లను ఆకట్టుకున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా కేంద్ర ఉక్కు గనుల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీని వాస్ వర్మ, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఇతర రాజేందర్, మహబూబ్ నగర్ ఎంపీ గళ్ళ అరుణ, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి వర్ధన్నపేట శాసనసభ్యులు నాగరాజు, తోపాటు... శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, రైల్వే అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్ , ఏసీ ఎమ్ శ్రీరామ్ మూర్తి, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి

● సీఎంకు ఘనంగా స్వాగతం పలుకుదాం
● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఈనెల 23న సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి అయినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కార్ , జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, శాసనసభ్యులు సంజీవరెడ్డి తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొనే భారీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. హెలిపాడ్ ను,సీఎం చేతుల మీదుగా ప్రారంభించే బసవేశ్వర విగ్రహం, నిమ్జ్ రోడ్, కేంద్రీయ విద్యాలయ భవనం, సభ స్థలంను మంత్రి దామోదర్ రాజనర్సింహ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... హెలిప్యాడ్ పనులు, ప్రజా వేదిక సభ వేదిక, వి ఐ పి గ్యాలరీ, మీడియా గ్యాలరీ ,వాహనాల పార్కింగ్ పనులు, రూట్ల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రణాళిక వివరాలు, గ్రీనరీ, స్టేజి ఏర్పాట్లు, స్టేజి అలంకరణ, పరిశుభ్రత, మిషన్ భగీరథ త్రాగునీరు, టాయిలెట్స్ అన్ని పనులు పూర్తి అయ్యాయన్నారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఎస్పీ పంకజ్ పరితోష్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఆర్డీవోలు,జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులుపాల్గొన్నారు.

### లేఖలు రాసి దులుపుకోవడం కాదు

# బుల్లెట్ దిగిందా? లేదా? చూడండి

● ఎవరి హయాంలో రైల్వే స్టేషన్లు అభివృద్ధి చెందాయో తెలుసా ● జమ్మికుంట-రైల్వే స్టేషన్ను అమృత్ భారత్లో చేరుస్తాం ● కరీంనగర్-హసన్ పర్తి నూతన రైల్వే లేన్ నిర్మాణంపై త్వరలో నిర్ణయం ● రూ.1480 కోట్ల వ్యయమవుతుందని డీపీఆర్ సిద్ధమైంది ● కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి పొన్నం, ఎమ్మెల్సీలు కొమరయ్య, అంజిరెడ్డి ● ప్రధాని మోడీ చేతుల మీదుగా వర్చువల్గా కరీంనగర్ సహా 103 రైల్వే స్టేషన్ల ప్రారంభం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: గతంలో బీఆర్ఎస్ సహా కొంతమంది నాయకులు ప్రతిదానికి లేఖలు రాసి చేతులు దులువుకున్నరు. ఇప్పుడు ఇంత అభివృద్ధి జరుగుతుంటే ఇదంతా మావల్లే జరిగిందని వాళ్లు ప్రచారం చేసుకుంటున్నరు. మాటలు కాదు... బుల్లెట్ దిగిందా? లేదా? చూడాలి అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఎవరి హయాంలో రైల్వే స్టేషన్లు అభివృద్ధి చెందాయో కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణే నిదర్శనమన్నారు. అతి త్వరలోనే జమ్మికుంట రైల్వే స్టేషన్ ను సైతం అమ్రుత్ భారత్ పథకంలో చేర్చి ఆధునీకరిస్తామన్నారు. ఈ నూతన లేన్ నిర్మాణానికి రూ.1480 కోట్ల వ్యయం అవుతుందని డీపీఆర్ లో పేర్కొన్నారని,
ఈరోజు దేశవ్యాప్తంగా ఆధునీకరించిన 103 రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ గా ప్రారంభించారు. అందులో భాగంగా కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంజయ్ తోపాటు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు...
దేశవ్యాప్తంగా అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రముఖులందరికీ నమస్కారం. దేశవ్యాప్తంగా 25 వేల కోట్ల వ్యయంతో 1350 రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరిస్తున్నం... వీటిలో రూ.2 వేల కోట్ల వ్యయంతో ఆధునీకరించిన 103 రైల్వే స్టేషన్లను ఈరోజు ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్ గా ప్రారంభించుకోవడం సంతోషం... మీకు తెలుసు... గతంలో, ఇప్పుడు రైల్వే స్టేషన్ ఎట్లా ఉందో తెలుసు. బీఆర్ఎస్ పాలనలో లేఖలకే పరిమితమయ్యారే తప్ప చేసిందేమీ లేదు. లేఖలు రాసి దులువుకోవడం కాదు... బుల్లెట్ దిగిందా? లేదా? చూడాలి. ఇయాళ రైల్వే స్టేషన్ లో సదుపాయాలను చూసి సెల్ఫీలు తీసుకునే పరిస్థితి వచ్చింది. ఏ దేశంలోనైనా రైల్వే, రోడ్లు, ఏవియేషన్ వ్యవస్థ బాగుపడితేనే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడతుంది. ఈ మూడు రంగాల అభివృద్ధి తరువాతే అమెరికా అగ్రరాజ్యమైంది. ఇది గమనించే రోడ్లు, రైల్వే, ఏవియేషన్ రంగాలపై మోదీ ప్రత్యేక ద్రుష్టి పెట్టారు... మోదీ పట్టుదల, అకుంఠిత దీక్షవల్లే ఇయాళ రైల్వే స్టేషన్ల రూపురేఖలన్నీ మారిపోతున్నయ్...
మోదీ పాలనలో తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. గత 11 ఏళ్లలో తెలంగాణలో 20కి పైగా ప్రాజెక్టులు... 2,298 కిలోమీటర్ల మేర పనులు చేపట్టినం. ఒక్క తెలంగాణలోనే 42 వేల 119 కోట్ల రూపాయల విలువైన రైల్వే పనులు ప్రస్తుతం వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఈ ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే బడ్జెట్ లో తెలంగాణ రైల్వే ప్రాజెక్టులకు 5 వేల 337 వేల కోట్ల రూపాయలు కేటాయించినం. కరీంనగర్ రైల్వే స్టేషన్ గతానికి, ఇప్పటికీ ఉన్న తేడా చూడండి... రూ.27 కోట్లకుపై వెచ్చించి ఆధునీకరణ పనులు పూర్తి చేసినంక స్టేషన్ రూపురేఖలే మారిపోయినవ్. ఎయిర్ పోర్టును తలపిస్తోంది. లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్ఓవర్ బ్రిడ్జిలు, ఏసీ వెయిటింగ్ హాళ్లు, నాన్ ఏసీ హాల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, టాయిలెట్లు, రిజర్వేషన్ కౌంటర్లు, టికెట్ కౌంటర్లు, సోలార్ పవర్ ప్లాంట్, రోడ్డు అభివృద్ధి, ప్లాట్ఫారం షెల్టర్ల ను చూస్తుంటే ముచ్చటేస్తోంది.
రాత్రపూట ఇంకా అందంగా కన్పిస్తోంది. ప్రజలంతా ఇక్కడికి వచ్చి సెల్ఫీలు దిగుతున్నారంటే అర్థం చేసుకోవచ్చు. కరీంనగర్ నుండి తిరుపతి రైలు ప్రతిరోజు నడిపేలా చూడాలని గతంలో నేను కేంద్ర రైల్వే మంత్రిని కోరాను. సాంకేతిక సమస్యలవల్ల సాధ్యం కాలేదు. వారానికి రెండుసార్లు ట్రైన్ నడిపేందుకు అంగీకరించి ఆ మేరకు చర్యలు తీసుకున్నారు. సాంకేతిక ఇబ్బందులను అధిగమించి వారానికి నాలుగుసార్లు నడిపేలా క్రుషి చేస్తాం.

### ప్రధాని మోడీ చేతుల మీదుగా

## బేగంపేట స్టేషన్ ప్రారంభం


● విమానాశ్రయాన్ని తలపించే విధంగా ఆధునీకరణ
● కేంద్రంతో కలిసి మరిన్ని అభివృద్ధి పనులకు రాష్ట్ర హామీ
● బేగంపేట స్టేషన్ ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపిస్తోంది ● మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



తెలంగాణ బ్యూరోప్రతినిధి: అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆధునికీకరించిన 103 రైల్వే స్టేషన్లను భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ జాబితాలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లు, ఆంధ్రప్రదేశ్కి చెందిన సూళ్లూరు పేట స్టేషన్లు ఉన్నాయి. బేగంపేట రైల్వే స్టేషన్లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి చూస్తున్న బేగంపేట స్టేషన్ ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపించేలా మారిందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, భవిష్యత్లో మరిన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసికట్టుగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. గట్కేసర్ నుండి యాదాద్రి వరకు భక్తుల కోసం ఎంఎంటీఎస్ సర్వీస్ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నల్గొండ రైల్వే మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరినట్లు చెప్పారు. ఘట్ కేసర్ యాదాద్రి మార్గాన్ని ఆరు నెలల్లో పూర్తిచేయాలన్న దిశగా ప్రయత్నిస్తున్నామని, దీనిపై సీఎం తో చర్చించి త్వరిత క్లియరెన్స్కి సహకరిస్తానని తెలిపారు.

### అందం అంటే బాహ్య సౌందర్యం కాదు..

ఇందిరా మహిళా శక్తి బజార్ను సందర్శించిన
మిస్ వరల్డ్ పోటీదారులు : మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఎర్న్, ఎంపవర్, ఎవాల్వ్ సాధనే మా లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. గురువారం మాదాపూర్లోనీ శిల్పారామంలో గల ఇందిరా మహిళా శక్తి బజారును మిస్ వరల్డ్పోటీదారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మిస్ వరల్డ్ పోటీదారులను ఉద్దేశించి మంత్రి సీతక్క ప్రసంగించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ) నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించేందుకు మహిళా సంఘాల ద్వారా ఎన్నో రకాల వ్యాపారాలను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. మహిళా ప్రగతి సమాజ ప్రగతి అన్న అంబేద్కర్ ఆశయాన్ని ఆచరణలో చేసి చూపిస్తున్నామని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీదారులు తెలంగాణ చారిత్రక సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను సందర్శించడం అభినందనీయమని చెప్పారు. అవి కేవలం చారిత్రక ప్రదేశాలే కావు.. కష్టానికి, తెగింపునకు, పోరాటానికి కేంద్రాలు అని చెప్పుకొచ్చారు. నాగరిక చరిత్రలో మొదట మాతృస్వామ్య వ్యవస్థ ఉండేదని, కానీ ప్రపంచం మొత్తం పితృస్వామ్య వ్యవస్థలోకి వెళ్ళిందన్నారు. దీనివల్ల మహిళలు తమ ఆర్థిక స్వతంత్రతను కోల్పోయారని అన్నారు. కానీ కాలం మారింది.. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ పోటీలను 72 ఏళ్ల తర్వాత తెలంగాణ వేదికవ్వడం మార్పుకు సంకేతమన్నారు. అందం అంటే బాహ్య సౌందర్యం కాదని, అందమంటే అంతర్గత శక్తి సామర్థ్యాలు, మేధస్సు, స్వేచ్ఛ భావన, స్థితప్రజ్ఞత అని వివరించారు. మహిళలు కోల్పోయిన ఆర్థిక స్వతంత్రతను, సాధికారతను తిరిగి సాధించేందుకు తెలంగాణలో ఇందిరా మహిళా శక్తి విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. సాధికారత అంటే విద్యకు, ఉపాధికి, ఆర్థిక శక్తికి, సమాన హక్కులకు అవకాశాలు కల్పించడమని, గ్రామీణ పేదరిక మహిళల ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ మహిళల కలలు, నైపుణ్యము, కష్టపడే తత్వానికి కలబోతగా నిలుస్తోందన్నారు. సుందరీమణులు, గ్రామీణ శ్రామిక మహిళలు సమానమే అని చాటి చెప్పేందుకు మిస్ వరల్డ్ పోటీకి దారులను ఇక్కడికి ఆహ్వానించామన్నారు. ఇది కేవలం ఒక మార్కెట్ కాదు.. సామాజిక మార్పుకు ఇది ఒక సంకేతమని అన్నారు. తెలంగాణ మహిళల స్ఫూర్తిని శక్తిని మీలో నింపుకొని ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నానని అన్నారు. తెలంగాణ.. జరూర్ ఆనా.. బార్ బార్ ఆనా అంటూ మిస్ వరల్డ్ పోటీదారులకు ధన్యవాదాలు తెలిపారు.

### భూ విస్తీర్ణం, లావాదేవీలు బట్టి సర్వేయర్ల నియామకం

# ప్రతి మండలానికి 6 నుంచి 8 మంది



● నక్షా లేని గ్రామాల్లో గ్రామసభలు పూర్తి
● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా లైసెన్స్ సర్వేయర్ల నియామకం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలివిడతలో ఐదువేల మంది లైసెన్స్ సర్వేయర్లను తీసుకోబోతున్నామని తెలిపారు.నక్షా లేని గ్రామాలు, లైసెన్స్ సర్వేయర్ల శిక్షణపై గురువారం నాడు మంత్రి అధికారులతో సమీక్షించారు. వీరికి ఈనెల 26వ తేదీ నుంచి ఆయా జిల్లా కేంద్రాల్లోనే శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. రెండు నెలల పాటు వీరికి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. దరఖాస్తుదారులు సోమవారం రోజు ఆయా జిల్లా సర్వే అధికారులను సంప్రదించాలని సూచించారు. శిక్షణ పూర్తన వెంటనే ఆయా మండలాల్లో భూవిస్తీర్ణం , భూ లావాదేవీలను బట్టి ఆరు నుంచి ఎనిమిది మంది సర్వేయర్లను నియమిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతిగ్రామంలో మండలంలో రెవెన్యూ డివిజన్లో పట్టణ ప్రాంతాల్లో భూములకు సంబంధించిన అనేక పంచాయితీలను ఈ సర్వేయర్ల ద్వారా శాశ్వత భూ పరిష్కారం చూపుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఎమ్మార్వో, సబ్ రిజిస్ట్రార్ దగ్గర భూములకు సంబంధించిన డాక్యుమెంట్లతోపాటు సర్వే పత్రాన్ని కూడా జత పరచాలని భూభారతి చట్టంలో పేర్కొనడం జరిగింది. ఇందుకు అనుగుణంగానే సర్వే విభాగాన్ని పూర్తి స్థాయిలో బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

**నెలరోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి... :** రాష్ట్రంలో నిజాం కాలం నుంచి సర్వే జరగని ,ఇప్పటివరకు సర్వే రికార్డులు లేని 413 నక్షా గ్రామాలలో రీసర్వే చేపడుతున్నామని ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మహబూబ్నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ , ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఐదు గ్రామాల్లో ముందుగా గ్రామసభలు నిర్వహించి సర్వేకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరిగింది. నెలరోజుల్లో ఈ సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా ఏ సంస్కరణలు చేపట్టినా ప్రజాకోణంలో ఆలోచించి తీసుకుంటుందని ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు.

## మేడ్చల్, శామీర్ పేట్, ఫ్యూచర్ సిటీ మెట్రో రైల్ డీపీఆర్లు తయార్

● ఫేజ్ -2(బి) పై ఎటువంటి సందిగ్ధతా లేదు ● స్పష్టం చేసిన మెట్రో ఎండీ శ్రీ ఎన్వీఎస్ రెడ్డి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: మేడ్చల్, శామీర్ పేట్, ఫ్యూచర్ సిటీ మెట్రో రైల్ డీపీఆర్ ల రూపకల్పన విషయంలో ఒక పత్రికలో ఈ రోజు (గురువారం) వచ్చిన వార్తలో వాస్తవం లేదని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ శ్రీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మెట్రో రెండో దశ(బి)కి సంబంధించిన డీపీఆర్ లు పూర్తి స్థాయిలో తయారయ్యాయని, వీటిని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఈ నెల 8 వ తేదీ (08.05.2025)న ఆమోదించిందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు డీపీఆర్ లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లభించే వరకు వీటికి సంబంధించిన కొన్ని అంశాల విషయంలో గోప్యత పాటించాల్సి ఉంటుందని, అందువల్ల పూర్తి వివరాలు అందించలేక పోతున్నామని ఆయన అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు జేబీఎస్ ను ఒక అంతర్జాతీయ హబ్ గా తీర్చిదిద్దడంతో పాటు డీపీఆర్ లో పలు అంశాలను పొందుపరిచామని తెలిపారు. రు.19,579 కోట్ల అంచనా వ్యయంతో 86.1 కి.మీ పొడవు గల జేబీఎస్–మేడ్చల్, జేబీఎస్–శామీర్ పేట్, ఎయిర్ పోర్ట్ ఫ్యూచర్ సిటీ మెట్రో ఫేజ్– (బి) కారిడార్ల ప్రతిపాదనలతో డీపీఆర్ లను పూర్తి చేయడం జరిగిందని అయన వెల్లడించారు. జేబీఎస్ స్టేషన్ – మేడ్చల్ మార్గం 24.5 కిలోమీటర్లు, 18 స్టేషన్లతో పూర్తి ఎలివేటెడ్ కారిడార్ గా ఉంటుందని తెలిపారు. అలాగే జేబీఎస్ స్టేషన్ – శామీర్పేట్ మార్గం 22 కిలోమీటర్ల కారిడార్ 14 స్టేషన్లతో నిర్మాణం అవుతుందని చెప్పారు. ఈ మార్గం 20.35 కి. మీ ఎలివేటెడ్ గాను, 1.65 కిలోమీటర్లు భూగర్భ మార్గం గాను ఉంటుందన్నారు. హకీంపేట విమానాశ్రయం సమీపంలో ఈ భూగర్భ మార్గం ఉంటుందని మెట్రో ఎండీ చెప్పారు.

## కేటీఆర్కు మహేష్గౌడ్ మాస్ సవాల్



తెలంగాణ బ్యూరోప్రతినిధి: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్కుమార్ గౌడ్ స్పందించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై న్యాయస్థానం తీర్పు తమకు అనుకూలంగా ఇచ్చినట్లు, తామంతా నీతిమంతులైనట్లు చెప్పేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. గురువారం గాంధీభవన్ లో మీడియాతో మహేష్కుమార్ గౌడ్ మాట్లాడారు. నాడు కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాగం జనార్ధన్ రెడ్డి ఈ పథకంపై కోర్టులో కేసు వేశారని గుర్తుచేశారు మహేష్కుమార్ గౌడ్. ఆయన పూర్తి ఆధారాలతో ఆ రోజు న్యాయస్థానంలో కేసు వేశారని మహేష్కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. నాగం జనార్ధన్ రెడ్డిని బీఆర్ఎస్లో చేర్చుకుని ఆ కేసును నీరుగార్చేలా, వీగిపోయేలా వ్యవహరించారని ధ్వజమెత్తారు. నాగం జనార్ధన్ రెడ్డి ఇప్పుడు బీఆర్ఎస్లో ఉన్నారని.. అలాంటిది కేసీఆర్పై ఎలా కొట్లాడతారని ప్రశ్నించారు. తామంతా నీతిమంతులమని, బీఆర్ఎస్ హయాంలో చేసిన అవినీతి మాయమైనట్లు కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ విషయంపై సీఎం రేవంతడ్డికి లేఖ రాసి ఏ విచారణ కావాలో అడగాలని కోరారు. ధైర్యం ఉంటే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సీఐడీ విచారణ కావాలా? జ్యూడిషియల్ విచారణ కావాలా అన్నది ప్రభుత్వానికి కేటీఆర్ లేఖ రాయాలని సవాల్ విసిరారు. అప్పుడు అవినీతి ఏవిధంగా జరిగిందో బట్టబయలవుతుందని స్పష్టం చేశారు.

## అమెరికా ఆర్థిక దాడి

ప్రపంచం నలుమూలల నుంచీ అమెరికాలోకి వలస వెళ్ళే వ్యక్తుల కల 'డాలర్ డ్రీమ్'. మంచి ఉద్యోగం, ఉన్నత జీవన ప్రమాణాలు, కుటుంబానికి ఆర్థిక సహాయం బీఇవన్నీ కలగలిపిన ఈ కల వెనుక అనేక త్యాగాలు ఉంటాయి. ముఖ్యంగా భారతీయులు, మెక్సికన్లు, ఫిలిపిన్స్, నైజీరియా వంటి దేశాలకు చెందిన వలసదారులు తమ సంపాదనలో భాగాన్ని తమ దేశాలకు పంపుతుంటారు. ఈ డబ్బులు లక్షలాది కుటుంబాల జీవనాధారంగా మారతాయి. అయితే, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రతిపాదించిన "5 శాతం రెమిటెన్స్ పన్ను" ఈ కలను గుల్ల చేస్తూ, వలసదారులపై మళ్ళీ ఆర్థిక భారాన్ని మోపే విధంగా మారుతోంది. ఈ పన్ను విధానం కేవలం వ్యక్తుల ప్రయోజనాలపై మాత్రమే కాక, అంతర్జాతీయ డాలర్ ప్రవాహాలపై, వలస విధానంపై, ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలపై గణనీయమైన ప్రభావం చూపుతుంది.. అయితే, తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన "5% రెమిటెన్స్ పన్ను" ఈ కలల్ని గుల్ల చేస్తోంది. ఈ పన్ను శాసన రూపం దాల్చితే వలసదారులపై మళ్లీ పెనుభారం పడనుంది. ఇది కేవలం ఒక పన్ను మాత్రమే కాదు %–% ప్రపంచ వ్యాప్తంగా వలసదారుల, ముఖ్యంగా భారతీయుల ఆర్థిక భద్రతపై, అమెరికా–ఇతర దేశాల మధ్య సంబంధాలపై, అంతర్జాతీయ డాలర్ ప్రవాహాలపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయం.

ట్రంప్ ప్రతిపాదించిన రెమిటెన్స్ పన్ను ప్రధానంగా అమెరికాలోని వలసదారులపై తీవ్ర ప్రభావాన్ని చూపనుంది. ముఖ్యంగా భారతీయులు, మెక్సికన్లు, ఫిలిపిన్స్, పాకిస్తాన్ వంటి దేశాలకు చెందిన వలసదారులు ప్రతినిత్యం తమ కుటుంబాలకు డబ్బు పంపుతున్నవారు. ఈ పన్నుతో వారి మార్గం కష్టతరం కానుంది. పన్ను భారం తట్టుకోలేక కొందరు తక్కువ మొత్తమే పంపే అవకాశం ఉంది, మరికొంతమంది అక్రమ మార్గాలను ఆశ్రయించే ప్రమాదం ఉంది. ఇది కేవలం వ్యక్తులపై కాదు బీతక్కువ, మధ్య ఆదాయ దేశాల ఆర్థిక వ్యవస్థలపైనా ప్రభావం చూపుతుంది.

ప్రస్తుతం అమెరికాలో 54 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో చాలామంది హెచ్1బీ, ఎల్1 వీసాలపై ఉన్న వలసదారులు. వీరు ప్రతి నెలా భారత్లోని తమ కుటుంబాలకు డబ్బు పంపుతుంటారు. 2023%–%24 నాటికి భారత్కు వచ్చిన మొత్తం రెమిటెన్స్లో అమెరికా వాటా 27.7 శాతం ఉండటం గమనార్హం. ఈ తరహా పన్నుతో వీరి డబ్బు పంపే సామర్థ్యం తగ్గుతుంది. చిన్న మధ్య తరగతికి చెందిన వలసదారులు ఈ భారం తట్టుకోలేక, అక్రమ మార్గాల్లో డబ్బు పంపే అవకాశమూ ఉంది.అలాగే, ఎన్ ఆర్ ఈ  ఖాతాల ద్వారా డబ్బులు పంేప వారి మీద కూడా ప్రభావం పడుతుంది. ఇది కేవలం కుటుంబ జీవన ప్రమాణాలకే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకూ హానికరం.

ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం, రెమిటెన్సు ఎఫ్ డి ఐఇ మరియు ఓ డి ఏ కంటే ఎక్కువ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధులు సమకూరుస్తున్నాయి. 2024లో ఇండియా %వి%129 బిలియన్ డాలర్లతో అత్యధిక రెమిటెన్స్ అందుకున్న దేశంగా నిలిచింది. ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థకు కీలక మార్గం.ఈ తరహా పన్నుతో డబ్బు పంపే మోతాదులు తగ్గవచ్చు. దీని ప్రభావం భారతదేశ విదేశీ మారకద్రవ్య నిధులపై, బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్పై పడుతుంది. డాలర్ ప్రవాహం తగ్గడం వల్ల రూపాయి విలువపై ఒత్తిడి పెరుగుతుంది. అంతేకాకుండా, అమెరికా సైతం దీని ద్వారా అంచనాలకన్నా తక్కువ ఆదాయం పొందే అవకాశం ఉంది.

భారత్ సహా ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు అమెరికాతో తమ ద్వైపాక్షిక సంబంధాలను మళ్లీ ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ తరహా నిర్ణయాలు అమెరికా 'సాఫ్ట్ పవర్' ను దెబ్బతీయవచ్చు. అంతర్జాతీయంగా మానవతా దృష్టికోణం గల దేశంగా ఉన్న అమెరికా తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం తన నైపుణ్య వలసదారులపై నియంత్రణ విధించడం క్రమేపి అనూహ్య ప్రతికూలతలకు దారి తీస్తుంది.

వలసదారులు అమెరికా సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారు – హెల్త్కేర్, ఐటీ, కన్స్ట్రక్షన్ వంటి రంగాల్లో వారి పాత్ర వందశాతం అవసరమైపోయింది..అమెరికాలో ఉన్న వివిధ దేశాల కమ్యూనిటీల మద్దతును కోల్పోయే ప్రమాదం కూడా ట్రంప్ పార్టీకి ఎదురవుతుంది.

ఈ పన్ను విధానం అమలవుతే, చిన్న మొత్తాల్లో డబ్బు పంపేవారు తగ్గిపోతారు. ఇది అనధికార మార్గాల పెరుగుదలకు దారితీస్తుంది. అంతేకాక, అమెరికాలోని ప్రతిభావంతుల వలస ప్రవాహం స్థిరంగా ఉండకపోవచ్చు. దీని ప్రభావం నాసా, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల ఉద్యోగ నియామకాలపై పడుతుంది. అదే సమయంలో, ఇతర దేశాలు –కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ – తమ వలస విధానాలు మరింత అనుకూలంగా మార్చి ప్రతిభను ఆకర్షించవచ్చు.

అమెరికా తన జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోణంలో ఈ విధానం అనుసరిస్తున్నా, దీని పరిణామాలు ప్రపంచ వృద్ధి పరస్పరాశ్రిత సంబంధాలపై ప్రతికూల  ప్రభావం చూపుతాయి. ట్రంప్ యొక్క ఈ పన్ను ద్వారా పొందదలచిన లక్ష్యాలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి – ఇది ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నమా? లేక వలసదారుల ప్రవాహాన్ని నియంత్రించే మార్గమా? లేక దేశంలో డబ్బు నిలుపుదల పెంచే అజెండా భాగమా? ఈ ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి.

ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ముందు దాని ప్రపంచ ప్రభావాన్ని, మానవతా కోణాన్ని, వలసదారుల సహాయ చర్యల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం అవసరం. చివరగా, ఈ నిర్ణయం డాలర్ కలను కలవర పరుస్తుందో లేదో కంటే, అమెరికా యొక్క సాఫ్ట్ పవర్ మరియు వలసదా రులపట్ల గల మానవతా దృష్టికోణం ఎటు దిశగా వెళ్తుందన్నదే ఇప్పుడు ప్రాధాన్యత పొందుతున్న ప్రశ్న.

# సింగిల్ స్క్రీన్స్ పునర్వైభవం సాధ్యమేనా ?



- ఒక సంస్కృతిని, సమాజాన్ని ప్రతిబింబించేది సినిమా
- కుటుంబం మొత్తం కలిసి సినిమా చూసే సంబరం తెర మరుగు
- సింగిల్ స్క్రీన్స్ ఎగ్జిబిటర్స్ ,నిర్మాతల మీద యుద్ధ భేరి
- మల్టిప్లెక్స్ ల తరహాలో పర్సెంటేజ్ మోడల్ కావాలని డిమాండ్
- సింగిల్ స్క్రీన్ సంస్కృతి పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం

**తేజస్వి**
**హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాలలోని సింగిల్ స్క్రీన్స్ ఎగ్జిబిటర్స్ ,నిర్మాతల మీద యుద్ధ భేరి మోగించారు. అద్దె తరహాలో నడపటం వల్ల సింగిల్ స్క్రీన్స్ నష్టాల్లో నడుస్తున్నాయని,మల్టిప్లెక్స్ ల తరహాలో పర్సెంటేజ్ మోడల్ కావాలని డిమాండ్ చేసారు. తమ డిమాండ్స్ తీర్చకపోతే జూన్ ఒకటి నుండి సింగిల్ స్క్రీన్స్ మూసేస్తామని అన్నారు.ప్రస్తుతం  కొంత శాంతి కుదిరినట్టు అనిపిస్తున్నా,సింగిల్ స్క్రీన్స్ ను కూడా మల్టిప్లెక్స్ తరహా వైభవంలో నడిపిస్తే బాగానే ఉంటుంది, కానీ దాని వల్ల సింగిల్ స్క్రీన్ సంస్కృతి పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం కూడా ఉంది.

**సింగిల్ స్క్రీన్ థియేటర్స్ –ఒక ఎమోషన్ :**

తెలుగు రాష్ట్రాల్లో సినిమా అనేది ఒక సంస్కృతి. ఊళ్ళో చిన్న థియేటర్ నుండీ, నగరాల్లో భారీ మల్టీప్లెక్స్ వరకు ప్రేక్షకుల అభిరుచి, వినోద పట్ల ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుంది. కానీ గత దశాబ్దంలో మల్టీప్లెక్స్ సంస్కృతి పెరిగిన తర్వాత, సింగిల్ స్క్రీన్ల పరిస్థితి అత్యంత కష్టతరంగా మారింది. తెలుగు సినిమా చరిత్రలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఓ కీలక పాత్ర పోషించాయి. ఒకానొక సమయంలో ప్రజల వినోద అవసరాలను తీర్చే ఏకైక మార్గం ఈ థియేటర్లు. ఒక పట్టణంలోనో గ్రామంలోనో ఉన్న ఏకైక స్క్రీన్ ప్రజలందరికీ ఒక కలల ప్రపంచంగా మారేది. సినిమా కేవలం వినోదం మాత్రమే కాదు, ఒక సంస్కృతిని, సమాజాన్ని ప్రతిబింబించేది. ఈ స్క్రీన్ల ద్వారా ఎన్నో సంచలనాలు, మైలురాళ్లు ప్రజల ముందు వచ్చాయి.

1950ల నాటికి, తెలుగు రాష్ట్రాల్లో సినిమాలు ప్రజల దృష్టిని ఆకర్షించసాగాయి. మొదటికి సినిమాలు ఆలయాల వద్ద, రైలు స్టేషన్ల సమీపంలో ప్రదర్శించబడేవి. కానీ తర్వాతి దశలో స్థిరమైన భవనాల్లో థియేటర్లు నిర్మించబడటంతో, ప్రజల అలవాట్లు మారాయి. 'విజయ' 'సంగం' 'శాంతి' 'మినర్వా' వంటి పేర్లు ప్రజల నోటిమాటలయ్యాయి. ఈ థియేటర్ల విశాలత, సౌండ్ వ్యవస్థ, భారీ తెరలు, ఇంటర్వల్లో తినుబండారాలు %–% ఇవన్నీ కలిసిపోయి ప్రేక్షకులకు అనుభూతి కలిగించేవి. కుటుంబం మొత్తం కలిసి సినిమా చూడడం ఓ సంబరంగా మారేది. ముఖ్యంగా పండుగల సమయంలో థియేటర్ ముందు టికెట్లు కోసం పడే క్యూలు ప్రత్యేక దృశ్యం.

**1970ల  నుండి 1990ల వరకూ:**

ఈ దశలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు బంగారు కాలాన్ని అనుభవించాయి. నందమూరి తారకరామారావు, అక్కినేని నాగేశ్వరరావు, చిరంజీవి, బాలకృష్ణ వంటి హీరోల సినిమాలు విడుదలైనప్పుడు థియేటర్ల వద్ద రికార్డులు నెలకొనేవి. ఫ్యాన్స్ సెలబ్రేషన్స్, కటౌట్లు, ఫ్లెక్సీలు %–% ఇవన్నీ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సాధారణంగా ఉండేవి.

చిత్రాలను కొన్ని వందల రోజులపాటు ప్రదర్శించడం, డబ్బింగ్ సినిమాలకు విపరీతమైన ఆదరణ, మాస్ సినిమాలకు వచ్చిన సందడి %–% ఇవన్నీ సింగిల్ స్క్రీన్ల విజయాన్ని ప్రతిబింబించేవి. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా థియేటర్ల అభివృద్ధికి సహకరించేది.

**సంక్షోభంలో సింగిల్ స్క్రీన్స్ :** 2000 తర్వాత సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. పెరిగిన టీవీలు, ఇంటర్నెట్, పైరసీ వల్ల సినిమాల థియేటర్ కౌంటర్ల వద్ద ఫుట్ఫాల్ తగ్గింది. ఇక మల్టీప్లెక్స్ థియేటర్ల ప్రవేశం పెద్ద ప్రమాదంగా మారింది. మల్టీప్లెక్సు యువతను ఆకర్షించగా, సింగిల్ స్క్రీన్లు అధునాతనత లోపించి నిలకడ కోల్పోయాయి. నిత్యం నూతన టెక్నాలజీకి మారాల్సిన అవసరాన్ని నెరవేర్చలేకపోయాయి.సింగిల్ స్క్రీన్లు, అధునాతన ప్రొజెక్షన్, సౌండ్ సిస్టమ్, ఎయిర్ కండీషనింగ్ వంటి సదుపాయాలను అందించలేకపోయాయి. మల్టీప్లెక్స్లతో పోటీ పడలేకపోయాయి. ప్రేక్షకులు లగ్జరీ అనుభవాన్ని కోరుతుండగా, సింగిల్ స్క్రీన్లు పాత విధానాల్లోనే కొనసాగాయి.వేడుకలకు, మెయింటెనెన్స్ ఖర్చులకు ఆదాయం సరిపోకపోవడం, వీక్షకుల  తగ్గుదల %–% ఇవన్నీ కలసి థియేటర్ల మూతపడటానికి కారణమయ్యాయి. తెలంగాణలోనే 800కి పైగా థియేటర్లు మూతపడ్డాయి. ఆంధ్రప్రదేశ్లో పరిస్థితి భిన్నంగా లేదు. పలు పల్లెటూళ్లలో ఇప్పటికీ మూసివేయబడిన థియేటర్ల శిథిలాలు కనిపిస్తుంటాయి. కరోనా మహమ్మారి సమయంలో థియేటర్లు పూర్తిగా మూసివేయబడ్డాయి. ఓటీటీ ప్లాట్ ఫారమ్స్ బాగా పెరిగాయి. పెద్ద సినిమాలు కూడా ఓటీటీలోనే విడుదలయ్యాయి. కోవిడ్ తర్వాత తిరిగి తెరచినప్పుడు చాలా థియేటర్లు మరలా ఆర్థికంగా నిలబడలేకపోయాయి.సింగిల్ స్క్రీన్లకు భవిష్యత్తు ఉంటే, అది ప్రైవేట్ రంగాల నుంచి మద్దతు, ప్రభుత్వ ఆదరణ, మరియు ఆదాయ భాగస్వామ్యం పద్ధతులు తెచ్చినప్పుడే. మల్టీప్లెక్స్ల తరహాలో షేర్ మోడల్ ను సింగిల్ స్క్రీన్లకు కూడా వర్తించాల్సిన అవసరం ఉంది. అప్పుడే కొత్త జీవితాన్ని వీటికి అందించవచ్చు.

సింగిల్ స్క్రీన్ థియేటర్లు కేవలం భవనాలు కాదు, అవి ఒక తరం గుర్తులు. అవి ఒక భావోద్వేగం. తెలుగు సినిమా అభివృద్ధిలో వీటి పాత్రను మరిచిపోలేం. ఇప్పుడు ఆ ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించాలంటే, ప్రభుత్వ, నిర్మాతల, ప్రేక్షకుల భాగస్వామ్యం అవసరం. లేదంటే, సింగిల్ స్క్రీన్లు మన జ్ఞాపకాలకే పరిమితమవుతాయి. ఏదేమైనప్పటికీ ప్రేక్షకుల అభిరుచుల్లో కూడా గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో థియేటర్ లు అన్ని రకాల సౌకర్యాలతో ఉండేట్టు మార్పు చెందాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు సింగిల్ స్క్రీన్స్ లో మార్పులు వస్తేబీ అవి కూడా కొంత స్థాయిలో మల్టిప్లెక్స్ రూపంలోకి మారతాయి. సింగిల్ స్క్రీన్స్ కి షేరింగ్ పద్ధతి ఇచ్చే దశలో నిర్మాతలు కూడా లేరు. పట్టుమని పదిరోజులు పెద్ద సినిమాలు కూడా థియేటర్లలో ఉండటం లేదు. ఈ నేపథ్యంలో సింగిల్ స్క్రీన్స్ భవిష్యత్తు ప్రస్తుతం అగమ్యగోచరంగానే ఉంది.

ఒక కాలంలో ప్రజల కలల ప్రపంచంగా వెలుగొందిన సింగిల్ స్క్రీన్ థియేటర్లు, ఇప్పుడు ఓ శూన్య ఛాయను అనుభవిస్తున్నాయి. హంగులు తక్కువైనా, హృదయాలకు దగ్గరగా ఉన్న ఆ థియేటర్లు ఇప్పుడు టికెట్ల ధరల నియంత్రణ, అధిక అద్దెలు, మల్టీప్లెక్స్ శక్తికి ఎదుర్కొంటూ సావాసంగా మారిపోతున్నాయి. తక్కువ విస్తీర్ణంలో, ఎక్కువ ఆత్మీయతతో గౌరవాన్ని సంపాదించిన ఈ థియేటర్లకు ఇప్పుడు ఆర్థికంగా జీవించడమే సవాలుగా మారింది.

ఉత్పత్తిదారులు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి మరింత దిగజారింది. మల్టీప్లెక్స్లకు ప్రత్యేక శాతం ఇచ్చే షేర్ మోడల్ను, సింగిల్ స్క్రీన్లకు మాత్రం నిరాకరించడం అన్యాయంగా మారింది. ఈ విధంగా న్యాయసమానత లేకుండా కొనసాగితే, గ్రామీణ ప్రాంతాల్లో సినిమా అనుభవమే కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం, ఫిలిం ఛాంబర్స్, నిర్మాతలు, థియేటర్ యజమానులు కలిసి సమన్వయంతో పని చేయాలి. సింగిల్ స్క్రీన్లను ప్రోత్సహించడానికి ప్రత్యేక పాలసీలు, టికెట్ ధరల పునఃసమీక్ష, రివెన్యూ షేరింగ్లో సమతుల్యత వంటి మార్గాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది.సినిమా అనేది కేవలం ఓ బిజినెస్ కాదుఒక సంస్కృతి, ఒక అనుభవం. అది చిన్న చిన్న టౌన్లలోని పాత సింగిల్ స్క్రీన్ల నుంచే లక్షల మందికి అందిన జీవిత జ్ఞానాన్ని అందించింది. అలాంటి స్థలాలు మూతపడితే, మన చలనచిత్ర సంస్కృతికే ప్రమాదం ఏర్పడుతుంది.

కాబట్టి... ఇప్పుడు సమయం. సింగిల్ స్క్రీన్ థియేటర్లను తిరిగి వెలుగులోకి తీసుకురావడమే సినీ పరిశ్రమ బాధ్యత. ఇవే నిజమైన ప్రేక్షక అనుభవానికి గుండెతడిని  అందించిన ప్రదేశాలు. ఆ అనుభవాల తెర మళ్లీ తెరుచుకోవాలి.

# ఆపరేషన్ సింధూర్ ను అత్యంత సమర్థవంతంగా నడిపింది వీరే



- శెభాష్ అనిపించుకున్న  ప్రధాని మోదీజీ,కల్నర్ సోఫియా ఖురేషి,వింగ్ కమాండర్ వ్యోమి
- దేశ సైనిక రక్షణ వ్యవస్థను అత్యంత బలోపేతంగా తీర్చిన ఘనులు
- భిన్న మతాలకు,మత సామరస్యానికి ప్రతి రూపంగా నిలచిన వైనం
- భాద్యతాయుత , క్రమశిక్షణ,అంకితభావం తో ఇద్దరూ మిలిటరీ ఆఫీసర్ల పర్యవేక్షణ
- ముగ్గురు ఘన పాటిలకు ఒక్కసారి మనమంతా లాల్ సలాం చేద్దాం!

**- బుగ్గన మధుసూదనరెడ్డి**
**9000369660**

శత్రుదేశానికి గట్టి గుణపాఠం చెప్పడమే కాదు వారి పాలిట సింహస్వప్నంగా నిలిచారు ఈ ముగ్గురు,వీరు నిజమైన దేశభక్తులు.ఒకరు మన భారతదేశ ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీజీ అయితే మరొకరు కల్నర్  సోఫియా ఖురేషి,ఇంకొకరు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్.ఇకపోతే కుక్క తోక ఎప్పటికి వంకరే అనే నీతి సూత్రం మన దాయాది పాకిస్తాన్ దేశానికి బాగా వర్తిస్తుంది,ఎందుకంటే భారత్ తో యుద్ధం పెట్టుకుంటే ఏమవుతుందో తెలిసి కూడా మాటి మాటికీ ఉగ్రవాదులను మన దేశం పైకి ఎగదోయాడాన్ని ఒక అనవాయితీగా చేసుకున్న పాక్ కు ' చెడపకురా చెడెవు ' అనే పెద్దల నానుడి బాగా వర్తిస్తుంది.ఒక విధంగా భారతదేశంతో గిల్లి కజ్జాలు పెట్టుకొని మరొమారు అందుకు భారీ మూల్యమే పాక్ దేశం చెల్లించింది.ఇకనైనా పాక్ పాలకులు,వారికి వంత పడుతున్న ఉగ్రవాదులు తోక ముడుచుకొని ఒక మూలాన పడి ఉంటే బాగుంటుంది.లేకపోతే ఇలాంటి అడుగడుగునా దేశభక్తి మూర్తిభవించిన ఓ స్ఫూరిదాయక పాలకుని చేతిలో,యావత్ భారతదేశ మహిళలకే వన్నె తెచ్చిన ఇలాంటి భాద్యతాయుతమైన,గొప్ప క్రమశిక్షణ,అంకితభావం గల ఈ ఇద్దరూ మిలిటరీ ఆఫీసర్ల పర్యవేక్షణలో మీ బతుకులు అదొగతిపాలు కావడం,మీ అడ్రస్సులు సైతం గల్లంతు అవ్వడం, దుమ్ము నాక్కుపోవడం తథ్యం.ఖాబర్ధార్ పాక్ దేశ పాలకులు అయిన మీరు, మీకు కొమ్ము కాస్తున్న ఆ మానవరూపంలో వున్న నరరూప రాక్షసులు అయిన ఉగ్రవాదులు. విశ్వవ్యాప్తంగా ఉగ్రవాదం నశించాలి,మానవత్వం వెల్లివిరియాలి,శాంతియుతంగా యావత్ ప్రపంచ ప్రజానీకం సుఖ,శాంతిసంతోషాలతో వర్ధిల్లాలి అదే మన భారతదేశం యొక్క లక్ష్యం,ఎజెండా.అన్నింటికి మించి తమ ప్రాణాల్ని సైతం లెక్కచేయక దేశ సరిహద్దుల్లో వీరపోరు సల్పుతున్న మన సైనిక వీర కిషోరాలకు ఈ ప్రత్యేక సందర్భంగా మనమంతా అంటే కోట్లాది మంది భారతదేశ ప్రజానీకం అయిన మనమందరం ఒక్కసారి వారికీ లాల్ సలాం చేద్దాం! జైహింద్! జై జవాన్! మేరా హిందూస్తాన్ మహాన్. అంతిమంగా మన భారతదేశాన్ని,భారతదేశ ప్రజలను కంటికి రెప్పలా కాపాడేందుకు తమ శక్తి వంచన లేకుండా కృషి సల్పుతున్న ఈ మూడు సింహాల లాంటి గొప్ప నాయకత్వం,ఆదర్శ వ్యక్తిత్వం,నర నరాన దేశభక్తి మూర్తిభవించిన ఇలాంటి ప్రజాసేవకులను చూసి యావత్ భారత్ జాతి గర్విస్తున్నది అనే మాట అక్షర సత్యం!.

ఏదిఏమైన భిన్న మతాలకు,మత సామరస్యానికి ప్రతి రూపంగా నిలుస్తూ,ఎలాంటి ఘర్షణలకు, కుట్రలకు,కుతంత్రాలకు తావు లేకుండా శాంతియుతమైన జీవనమే ఏకైక లక్ష్యంగా,ఎజెండాగా ముందుకు వెళ్తూ ప్రపంచ పటంలో తన కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని అధిరోహించిన భారతదేశం వంటి అత్యంత సమర్థవంతమైన దేశంతో అనవసరంగా కయ్యానికి కాలు దువ్వి మన శత్రుదేశమైన పాక్ ఓ భారీ మూల్యమే చెల్లించింది అనే మాట సత్యదూరం కాదు. ఏమైనా ఇప్పటికయినా మించి పోయింది లేదు పాకిస్తాన్ తమ దుష్ట పన్నాగాలకు తెరదించి మన భారతదేశంతో శాంతి ఒప్పందం చేసుకొని,రాజీ పంథాను అనుసరిస్తే అది పాకిస్తాన్ దేశానికి,అక్కడి ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది.అలా చేయకుండా వినాశ కానికి కారణభూతమయ్యే ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ భారతదేశంపై ఉగ్రవాదులు దండేత్తే రాక్షస చర్యలకు పాక్ దేశం పూనుకుంటే మాత్రం ఇప్పటికే పాకిస్తాన్ దేశంలోని ప్రజలు దాదాపు 50 శాతం  మూడు పూటలా తిండికి కూడా నోచుకోలేని దయనీయ పరిస్థితిలోకి చేరుకున్న నేపథ్యంలో, భారతదేశంతో ఏటి కి ఎదురీదేలా మరోసారి యుద్ధ తంత్రాలు రచిస్తే మాత్రం పాక్ దేశానికి ముమ్ముందు పుట్ట గతులు ఉండవు అనే చేదు వాస్తవాన్ని అ దేశపాలకులు ఎంత త్వరగా గ్రహించి,కాస్తంతా వివేకంతో,ఒళ్ళు దగ్గర పెట్టుకొని,బుద్ధి తెచ్చుకొని మరీ నడుచుకుంటే అది వారి ఇంటికి,వంటికి అంతా మంచిది.ఉగ్రవాదాన్ని కుక్కటి వ్రేళ్ళతో సహా పేకలించేందుకు యావత్ ప్రపంచ దేశాలు అన్ని ఏకమై మన భారతదేశంతో కలిసి పనిచేసే తరుణం ఆసన్నమైంది.ఇందులో భాగంగా ఉగ్రవాదానికి శాశ్వతంగా నూకలు చెల్లెలా యావత్ ప్రపంచ దేశాలు తీవ్ర కృషి సల్పితే అంతిమంగా ఉగ్రవాదం పీడ విరగడ అవ్వడం తథ్యం! జైహింద్! ప్రపంచం శాంతి వర్ధిల్లాలి!

# ప్రపంచ దేశాలను దూరం చేసుకుంటున్న ట్రంప్ విధానాలు



డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షత అమెరికా యొక్క ప్రపంచ పటంలోని స్థానాన్ని గణనీయంగా మార్చింది. అతని విధానాలు, ప్రసంగాలు మిత్రరాజ్యాలను దూరం చేశాయి. ప్రత్యర్థులను ప్రోత్సహించాయి. ముఖ్యమైన అంశాలపై అంతర్జాతీయ సహకారాన్ని బలహీనపరిచాయి. అమెరికా దీర్ఘకాలంగా దాని విదేశీ జోక్యాల వల్ల విమర్శలను ఎదుర్కొంటుంది.ఇప్పుడు ట్రంప్ పాలనతో మరింత స్థిరపర్చింది.ఇప్పుడు అమెరికాను స్వార్థపూరిత బుల్లీగా చిత్రీకరించబడింది. సహజంగా ప్రపంచంలో అమెరికా పట్ల ఉన్న ద్వేషాన్ని ట్రంపాలన మరింత విశాలం చేసింది. ట్రంప్ యొక్క అత్యంత హానికరమైన వారసత్వాలలో ఒకటి బహుళ పక్ష వాదాన్ని తిరస్కరించడం. అతను పారిస్ క్లైమేట్ ఒప్పందం నుండి అమెరికాను వైదొలిగేలా చేశారు.వాతావరణ మార్పులతో పోరాడే ప్రపంచ ప్రయత్నాలను విస్మరించాడు. అలాగే, ఇరాన్ అణు ఒప్పందం (జేసీపీఓఏ)నుండి బయటకు వచ్చి, మధ్యప్రాచ్యంలో అస్థిరతను పెంచారు. ఈ చర్యలు అమెరికా సామూహిక భద్రత కంటే స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందనే అభిప్రాయాన్ని దృవపరిచాయి. వాణిజ్య యుద్ధాలు కూడా ట్రంప్ యొక్క శత్రుత్వానికి మరొక నిదర్శనం. కెనడా, యూరోపియన్ యూనియన్ మరియు జపాన్ వంటి మిత్రదేశాలపై సుంకాలు విధించడం ద్వారా, ఈ ఆర్థిక భాగస్వాములను సహకారులుగా కాకుండా "పరాన్న జీవులు లుగా" చిత్రీకరించారు. ట్రంప్ చర్యలు ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బ తీసాయి.  ఎత్తుకు పై ఎత్తు వేశే జిత్తులమారి తనాన్ని పెంచేలా చేశాయి. వాణిజ్యాన్ని "జీరో–సమ్" గేమ్ గా చూడటం ద్వారా, అమెరికా నాయకత్వంపై నమ్మకాన్ని కోల్పోయింది.  ట్రంప్ అధికార వాద నాయకులతో ఉన్న సన్నిహిత సంబంధాలు అమెరికా కు ఉన్న కన్నింగ్ ఇమేజ్ను పెంచాయి. వ్లాదిమిర్ పుతిన్, కిమ్ జాంగ్–అన్ మరియు రొడ్రిగో డుటర్టే వంటి నాయకులను మెచ్చుకోవడం, ప్రజాస్వామ్యాలు మరియు నియంతృత్వాల మధ్య తేడాలు లేవని సూచించింది. సిరియా నుండి అకస్మాత్తుగా సైనికులను వెనక్కి తీసుకోవడం, ఐఎస్ ఐఎస్ తో పోరాడిన కుర్దిష్ మిత్రులను ద్రోహం చేయడం వంటివి అమెరికా వాగ్దానాలు నమ్మదగినవి కావని ప్రపంచానికి చాటింది.  ప్రపంచ ఆరోగ్య సంస్థ పట్ల అతని వైఖరి కూడా విధ్వంస కరమైనది. కోవిడ్–19 మహమ్మారి సమయంలో (డబ్ల్యూహెచ్ఓ)కు నిధులను కత్తిరించడం అమానుషం. ఆరోగ్య విషయంలో అంతర్జాతీయ సహకారాన్ని విస్మరించడం వంటివి అతని "అమెరికా ఫస్ట్" విధానం యొక్క స్వార్థం పూరిత ప్రమాదాలను బయట పెట్టాయి.  దేశీయంగా, ఆఫ్రికన్ దేశాలను "చెత్త దేశాలు" అని పిలవడం, వలస దారులపై దాడి చేయడం, జాతివివక్ష వ్యతిరేక ప్రదర్శనలను విస్మరించడం వంటి ట్రంప్ యొక్క విభజన కరమైన ప్రసంగాలు అమెరికా ఒక జాత్యా హంకార, విదేశీ విరోధ శక్తిగా భావించ బడేలా చేశాయి.  ట్రంప్ తర్వాతి నాయకులు మిత్ర రాజ్యాల తో సంబంధాలు మరమ్మత్తు చేయవచ్చు, కానీ నష్టం అలాగే మిగిలి పోయింది. అమెరికా అనూహ్యమైన, స్వార్థ పూరితమైన  దేశంగా సహకారానికి విరుద్ధంగా ఉన్న దేశంగా ప్రపంచం చూసింది. వాతావరణ మార్పులను తిరస్కరించడం, వాణిజ్య యుద్ధాలు, మిత్రులను వదిలేయడం వంటి ట్రంప్ విధానాలు అమెరికాను ప్రపంచానికి శత్రువుగా చూసే భయాలను నిజం చేశాయి. నమ్మకాన్ని పునరుద్ధరించడానికి కేవలం పాలన మారడం సరిపోదు. బహుళ పక్ష సహకారానికి కట్టు బడటం అవసరం.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్  9849328496**

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# మీరు హద్దులు దాటుతున్నారు
## ఈడీ దాడులపై సుప్రీం తీవ్ర ఆగ్రహం



న్యూఢిల్లీః తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మద్యం సంస్థ టాస్మాక్పై చేస్తున్న ఈడీ దాడులపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సీరియస్ అయింది. ఈడీ అన్ని హద్దులు దాటిందంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్.. కేంద్ర సంస్థకు వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శాంతిభద్రతలు రాష్ట్రానికి సంబంధించిన అంశం.. రాష్ట్రంలో ఈడీ చర్యలు అసమానమైనవిని.. అంతేకాకుండా రాజ్యాంగ విరుద్ధమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. తమిళనాడులో రూ. 1,000 కోట్ల మద్యం కుంభకోణం జరిగిందని ఈడీ ఆరోపించింది. మద్యం సరఫరా ఆర్డర్లను పొందడానికి డిస్టిలరీలు లెక్కల్లో చూపని నగదు ఇచ్చాయని పేర్కొంది. దీంతో తమిళనాడులో ఈడీ దాడులు చేస్తోంది. దీన్ని సవాల్ చేస్తూ మద్రాస్ హైకోర్టులో ప్రభుత్వం పిటిషన్ వేసింది. అయితే ఈ పిటిషన్ కొట్టేస్తూ ఈడీ దాడులకు అనుమతి ఇచ్చింది. దీంతో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సరైన ఆధారాలు లేకుండా ఈడీ దర్యాప్తు చేస్తోందని.. టాస్మాక్ సిబ్బందిని.. మహిళలను వేధిస్తున్నారని గోప్యత.. ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నారని పిటిషన్లో పేర్కొంది. గురువారం పిటిషన్ విచారించిన ధర్మాసనం.. తక్షణమే దాడులు నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఈడీ దాడులపై మండిపడింది. ఈడీ హద్దులు దాటి ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసిందిసుప్రీంకోర్టు తీర్పుపై డీఎంకే ప్రభుత్వం హర్షం వ్యక్తం చేసింది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తోందని ధ్వజమెత్తింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈడీ దాడులకు కేంద్రం ఉసిగొల్పుతోందని ఆరోపించింది.

# దాయాదిని మోకాళ్ల మీద కూర్చోబెట్టాం

**ఆపరేషన్ సిందూర్ విజయవంతం - ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాం - మన దళాల చక్రవ్యూహాలతో శత్రువులు ఉక్కిరిబిక్కిరి**

**మన మహిళల సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశాం - 'సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో చూశా**

**పహల్గామ్ ఉగ్ర దాడిపై మరోసారి ప్రధాని మోడీ సీరియస్ కామెంట్లు**



న్యూఢిల్లీ : మన భద్రతా బలగాలు పాకిస్థాన్ను మోకాళ్లపై కూర్చోబెట్టాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ను ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్లో ఉగ్రవాదుల ఏరివేతకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్విస్తున్నారని రాజస్థాన్లోని బికనేర్లో మాట్లాడారు.

మన మహిళల సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. మోడీ రాజస్థాన్లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బికనీర్లో ఏర్పాటు చేసిన సభలో పహల్గామ్ గురించి మాట్లాడుతూ.. పవర్ఫుల్ స్పీచ్ ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతం చేశామని తెలిపారు. కేంద్రం త్రివిధ దళాలకు పూర్తి స్వచ్ఛ ఇచ్చిందని గుర్తుచేశారు. మన దళాలు చక్ర వ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయని తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడికి జవాబుగా 22 నిమిషాల్లోనే ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు చెప్పారు. భారత్లో రక్తపుటేర్లు పారించిన వాళ్లను ముక్కలు.. ముక్కలు చేసినట్లు మోడీ పేర్కొన్నారు.

'సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశారు. ఏప్రిల్ 22న ఉగ్రదాడికి ప్రతిగా 22 నిమిషాల్లో ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం. ఉగ్రమూకలను మట్టిలో కలిపేశాం. నా సిరల్లో రక్తం కాదు సిందూరం ప్రవహిస్తోంది. పాక్లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్బేస్ ఐసీయూలో ఉంది. అణుబెదిరింపులకు భారత్ ఇక ఏమాత్రం భయపడదు. పాక్తో ఎలాంటి వాణిజ్యం, చర్చలు ఉండవు. చర్చల మాట అంటూ వస్తే.. అది పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే. ఉగ్రదాడి జరిగితే.. పాక్ ఆర్మీ, ఆర్థికవ్యవస్థ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మనం స్పష్టంచేశాం.


. మతం ఆధారంగా వేరు చేసి.. మహిళల నుదిటిపై ఉన్న సిందూరాన్ని తుడిచేశారని.. దానికి ప్రతీకారంగానే మన దళాలు వాళ్లను మట్టిలో పాతిపెట్టేశారన్నారు. 140 కోట్ల మంది భారతీయుల హృదయాలను గాయపరిచారు.. అందుకే వాళ్లను ముక్కలు.. ముక్కలు చేశామని వెల్లడించారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాదుల శిబిరాలు నాశనం అయినట్లు చెప్పారు. త్రివిధ దళాల దెబ్బకు పాకిస్థాన్ వెనక్కి తగ్గిందని తెలిపారు. ఇక అణు బాంబుల భయానికి భారతదేశం వెనుకాడదని మరోసారి మోడీ స్పష్టం చేశారు. మన దేశానికి న్యాయంగా చెందాల్సిన నీరు ఇక పాక్కు ప్రవహించదు. భారత ప్రజల జోలికివస్తే.. గట్టి గుణపాఠం తప్పదు" అని రాజస్థాన్ వేదికగా హెచ్చరికలు చేశారు.

"భారత్ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీ కృషి జరుగుతోంది. ఈ దిశగా గత 11 ఏళ్లుగా అవిశ్రాంతంగా పనిచేశాం. భారత రైలు నెట్వర్క్ ఆధునికీకరిస్తున్నాం. వేగం, పురోగతికి వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రతీకలు" అంటూ కేంద్ర ప్రభుత్వం చేపడుతోన్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునర్నిర్మించిన దేశ్నోక్ స్టేషన్ను ప్రారంభించారు. అలాగే బికనేర్-ముంబయి ఎక్స్ప్రెస్ రైలుకు జెండా ఊపారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. అలాగే దేశ్నోక్లోని కర్ణిమాత ఆలయంలో పూజలు చేశారు.

ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్లోని పహల్గాంకు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. దానికి బదులుగా ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్లోని ఉగ్రస్థావరాలను భారత బలగాలు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే.

# భారత్ని ఫాలో అవుతున్న ఆఫ్ఘన్

**కునార్ నది జలాలు పాక్కు నిలిపేయాలని నిర్ణయం-పాకిస్థాన్లోకి వెళ్లే నీటి ప్రవాహంలో ఆనకట్టలు కట్టే యత్నం**



ఇరు దేశాల ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం ఇటీవల సిందూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసి పాకిస్థాన్ ప్రాంతానికి వెళ్లాల్సిన నీటిని అడ్డుకుంది. ప్రస్తుతం.. భారత్ మార్గాన్నే అనుసరించేందుకు ఆఫ్ఘనిస్తాన్ సిద్ధమైంది. ఆఫ్ఘనిస్థాన్ ప్రాంతం గుండా పాకిస్థాన్లోకి వెళ్లే నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు ప్లాన్ చేస్తుంది. ఇందుకోసం కొత్త ఆనకట్టలను నిర్మించాలని ఆఫ్ఘనిస్థాన్ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

సోషల్ మీడియా ప్లాట్ఫామ్ 'ఎక్స్'లో బలూచ్ కార్యకర్త ఒకరు ఈ విషయాన్ని పోస్టు చేశారు. "ఇది నా పాకిస్తాన్ ముగింపు ప్రాం తం. భారత్ తర్వాత, ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్ పాకిస్తాన్కు వారి ప్రాంతం నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించడానికి ఆనకట్టలను నిర్మించడానికి సిద్ధమవుతోంది" అని పేర్కొన్నారు. అయితే, ఈ వాదనను ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ అధికారికంగా ధృవీకరించనప్పటికీ నీటి వనరులపై ఈ ప్రాంతంలో పెరుగుతున్న డిమాండ్ను తెరపైకి తెస్తోంది.

బలూచిస్థాన్ కార్యకర్త పోస్ట్ ప్రకారం.. తాలిబన్ జనరల్ ముబిన్ ఇటీవల ఆనకట్ట స్థలాన్ని పరిశీలించడానికి కునార్ ప్రాంతాన్ని సందర్శించారు. ముబిన్ కాబూల్ లోని ప్రభుత్వాన్ని నిధులు సేకరించి బహుళ ఆనకట్ట ప్రాజెక్టులను ప్రారంభించాలని కూడా కోరారు. ఈ నీరు మన రక్తం. మన విద్యుత్ అవసరాలను తీర్చడానికి సహాయపడే నీటిని మనం ఆపాలి. మన వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేసుకోవచ్చు అని ముబిన్ చెప్పినట్లు బలూచ్ కార్యకర్త పేర్కొన్నారు. కునార్ నది హిందూ కుష్ పర్వతాలలో ఉద్భవించి కాబూల్ నదిలో కలుస్తుంది. ఇది పాకిస్థాన్లోకి ప్రవహిస్తుంది.

# "అగ్నివీరులు".. అంతా 20 ఏళ్ల లోపు వారే..

**కీలక సైనిక స్థావరాలను కాపాడిన యువ రక్తం.. పాకిస్తాన్ దాడిని తిప్పికొట్టిన అగ్నివీరులు..**

**ఆపరేషన్ సిందూర్లో సత్తా నిరుపించారు - 3000 మంది అగ్నివీరులు పాల్గొన్నట్లు పేర్కొన్న రక్షణ శాఖ.. - సర్వత్రా వీరి సేవలపై ప్రశంసల వర్షం..**



న్యూఢిల్లీ : "ఆపరేషన్ సిందూర్"తో భారత్ పహల్గామ్ ఉగ్రదాడికి పాకిస్తాన్పై ప్రతీకారం తీర్చుకుంది. పాకిస్తాన్ కేవలం 5 రోజుల్లోనే కాళ్ల బేరానికి వచ్చింది. పాక్ వైమానిక ఆస్తుల్లో 20 శాతాన్ని కోల్పోయింది. మొత్తం 11 పాక్ ఎయిర్బేస్లను భారత్ ధ్వంసం చేసింది. దీనికి తోడు పాకిస్తాన్, పీఓకే లోని లష్కరే తోయిబా, జైష్ ఏ మహ్మద్ ఉగ్రవాద కార్యాలయాలు, ట్రైనింగ్ కేంద్రాలపై భారత్ విరుచుకుపడింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదుల హతమయ్యారు.

ఇదిలా ఉంటే, ఈ ఆపరేషన్ ఇంత విజయవంతం కావడంతో "అగ్నివీరుల" కృషి ఉందని రక్షణ వర్గాలు ప్రశంసించాయి. సుమారుగా 3000 మంది అగ్నివీరులు గన్నర్లు, ఆపరేటర్లు, భారీ వాహన డ్రైవర్లుగా తమ సేవల్ని అందించారని, వీరి పనితీరు సాధారణ సైనికులతో సమానంగా ఉందని ప్రశంసలు దక్కుతున్నాయి. వీరందరి వయసు 20 ఏళ్ల లోపే కావడం గమనార్హం. వీరందర్ని అగ్నిపథ్ పథకం ద్వారా సైన్యం రిక్రూట్ చేసుకుంది.

పాకిస్తాన్ క్షిపణి, డ్రోన్ దాడుల నుంచి భారత సైనిక స్థావరాలను రక్షించారు. కీలకమైన వాయు రక్షణ వ్యవస్థను నిర్వహించడం నుంచి పదే పదే శత్రువు దాడి చేస్తున్నప్పటికీ అనేక స్థావరాలను, నగరాలను కాపాడుకోవడంలో అగ్నివీరులు అత్యున్నత ప్రతిభను కనబరిచారు. ప్రతీ వైమానిక రక్షణ యూనిట్లో 150-200 మంది అగ్నివీరులు ఉన్నారని, ప్రధానంగా పశ్చిమ సరిహద్దుల్లో మోహరించినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. అగ్నివీరులు ముఖ్యంగా నాలుగు విభాగాల్లో పనిచేశారు. గన్నర్లుగా, ఫైర్ కంట్రోల్ ఆపరేటర్లుగా, రేడియో ఆపరేటర్లుగా, గన్స్-క్షిపణులు అమర్చిన హెవీ డ్యూటీ వాహనాలకు డ్రైవర్లుగా పనిచేశారు. భారత తయారీ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఆకాష్తీర్ యాక్టివేట్ చేయడానికి, ఆపరేటర్ చేయడానికి సహాయం చేశారు.


భుజం నుంచి ప్రయోగించే క్షిపణులను, %ూ-70, ్గబ-23-2దీ% వంటి అప్గ్రేడ్ చేసిన యాంటీ-ఎయిర్క్రాఫ్ట్ గన్లను నిర్వహించడం, పెచోరా, షిల్కా, %ూూూ-ూఖ%, స్ట్రెలా ,తుంగుస్కా వంటి మ్యానింగ్ సిస్టమ్లు, ఆకాష్ మిస్సైల్ సిస్టమ్, ఇతర ఉపరితలం నుండి గాలికి ప్రయోగించే క్షిపణులను మోహరించడం, ప్రయోగించడంలో చురుకుగా పాల్గొన్నారు. రన్నింగ్ రాడార్లు, కమ్యూనికేషన్ నెట్వర్క్లు, ఆకాష్టీర్ నోడ్లు, కొన్ని ఆయుధ వ్యవస్థలను మోహరించిన తర్వాత ఫార్వర్డ్ జోన్లలో సెంట్రీలుగా కూడా వ్యవహరించాయి.

**అగ్నివీర్ పథకం:**నాలుగు ఏళ్ల సేవల కోసం సైన్యంలో య-ువకులను రిక్రూట్ చేసుకునేందు కేంద్రం "అగ్నివీర్" పథకాన్ని ప్రవేశపెట్టింది. వారిలో 25% మందిని మరో 15 సంవత్సరాలు రెగ్యులర్ చేస్తారు. వీరు 17.5 ఏళ్ల నుంచి 21 సంవత్సరాల మధ్య యువత అగ్ని పథ్ స్కీమ్కి అర్హులు. అగ్నివీర్లు సర్వీస్లో మొదటి సంవత్సరంలో రూ. 4.76 లక్షల వార్షిక జీతం, నాలుగో ఏడాదిలో రూ. 6.92 లక్షలు పొందుతారు, రూ. 48 లక్షల నాన్-కంట్రిబ్యూటరీ బీమా కవర్, సర్వీస్ కారణంగా మరణిస్తే రూ. 44 లక్షల అదనపు ఎక్స్గ్రేషియా పొందుతారు.

# ఖండాంతర అణు క్షిపణిని పరీక్షించిన అమెరికా..!

**కాలిఫోర్నియాలోని వాన్డెన్ బెర్గ్ స్పేస్ బేస్ లో పరీక్ష**

**మినిట్ మ్యాన్-3 విజయవంతమైనట్లు ప్రకటించిన డిఫెన్స్ వ్యవస్థ**



వాషింగ్టన్ : అమెరికా అత్యంత శక్తిమంతమైన ఖండాంతర అణు క్షిపణి మినిట్మ్యాన్-3ను పరీక్షించింది. ఓ పక్క అధ్యక్షుడు ట్రంప్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ గోల్డెన్డోమ్ నిర్మిస్తున్నట్లు ప్రకటించిన వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం విశేషం. కాలిఫోర్నియాలోని వాన్డెన్బెర్గ్ స్పేస్ బేస్లో ఈ పరీక్ష జరిగింది. ఈ క్షిపణి గంటకు 15,000 మైళ్లోగంతో.. 4,200 కిలోమీటర్లు ప్రయాణించింది. చివరికి మార్షల్ ఐల్యాండ్స్లోని అమెరికా స్పేస్ అండ్ మిసైల్ డిఫెన్స్ కమాండ్కు చెందిన బాలిస్టిక్ డిఫెన్స్ టెస్ట్ ప్రదేశానికి చేరింది.

ఈ పరీక్షపై అమెరికా గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ జనరల్ థామస్ బుస్సేరీ ఓ ప్రకటన విడుదల చేశారు. "ఈ ఐసీబీఎం పరీక్ష అమెరికా సన్నద్ధతకు, శక్తికి చిహ్నం" అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలకు.. ఈ పరీక్షకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. రొటీన్లో భాగంగానే ఇది జరిగిందని చెప్పారు. మినిట్మ్యాన్-3లో అత్యంత శక్తిమంతమైన మార్క్-21 రీఎంట్రీ వెహికల్ ఉంటుంది. దీనిలో న్యూక్లియర్ పేలోడ్ను అమర్చవచ్చు. గతంలో పలుమార్లు దీని శక్తి సామర్థ్యాలను అమెరికా పరీక్షించింది. గతేడాది నవంబర్లో ట్రంప్ విజయానికి ముందు కూడా ఒకసారి పరీక్షించారు. వాస్తవానికి మినిట్మ్యాన్ క్షిపణి 1970ల నాటిది. దీనిని సెంటెనిల్ సిస్టమ్తో భర్తీ చేయాలని అమెరికా భావిస్తోంది. కానీ, మినిట్మ్యాన్-3 మాత్రం అమెరికా వాయుసేన అత్యంత నమ్మకమైన క్షిపణిగా భావిస్తోంది.

భవిష్యత్తులో అమెరికా గగనతలంలోకి ఏ క్షిపణీ ప్రవేశించకుండా, ఏ అణ్వాయుధమూ సమీపించకుండా 'గోల్డెన్ డోమ్' అనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థ నిర్మించేందుకు అగ్రరాజ్యం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం శ్వేతసౌధంలో కీలక ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' తరహాలో అమెరికా కోసం 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ వ్యవస్థను ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవస్థ నిర్మాణానికి 175 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 15 లక్షల కోట్లు) ఖర్చవుతుందని పేర్కొన్నారు. దీంతో అమెరికా ఇక అంతరిక్షంలోనూ ఆయుధాలను మోహరించనుంది. యూఎస్ స్పేస్ ఫోర్స్ జనరల్ మైఖేల్ గుట్లీన్ ఈ 'గోల్డెన్ డోమ్' నిర్మాణాన్ని పర్యవేక్షిస్తారని ట్రంప్ తెలిపారు. ఇది తన పదవీ కాలం ముగిసేలోపు పూర్తవుతుందని ట్రంప్ చెప్పారు.

# అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల ప్రారంభం

**వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని మోదీ**

**18 రాష్ట్రాల్లో ఆధునీకరించిన 103 అమృత్ రైల్వే స్టేషన్లు**





జైపూర్ : రాజస్థాన్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ్నోక్ రైల్వేస్టేషన్ నుంచి 18 రాష్ట్రాల్లో ఆధునీకరించిన 103 అమృత్ రైల్వే స్టేషన్లను ఆయన వర్చువల్గా ప్రారంభించారు. దీంతో తెలంగాణలో 3 ఏపీలో 1, యూపీలో 19, గుజరాత్ 18, మహారాష్ట్రలో 15, రాజస్థాన్లో 8 రైల్వేస్టేషన్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్లాల్ శర్మ పాల్గొన్నారు. అంతకుముందు బికనీర్లోని కర్ణిమాత ఆలయాన్ని ఆయన సందర్శించారు. అమ్మవారికి ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారి తీర్థ ప్రసాదాలను ఆలయ పూజారులు.. ప్రధాని మోదీకి అందజేశారు. అనంతరం బికనీర్ ఎయిర్ బేస్ను మోదీ సందర్శించారు. మరోవైపు బికనీర్ సమీపంలో పాలనా గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారిగా ప్రధాని మోదీ రాజస్థాన్లో పర్యటించారు. ఇంకా చెప్పాలంటే.. ఏప్రిల్ 22వ తేదీ పహల్గాంలో పర్యాటకులే లక్ష్యం ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ల మధ్య పరిస్థితులు ఉద్రిక్తతంగా మారాయి. అలాంటి వేళ.. ఆపరేషన్ సింధూర్ను ప్రభుత్వం చేపట్టింది. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో దాదాపు 100 మందికిపైగా ఉగ్రవాదులు మరణించారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన సరిగ్గా నెల రోజులకు ప్రధాని మోదీ రాజస్థాన్లోని బికనీర్ ఎయిర్ బేస్ను సందర్శించడం గమనార్హం.

**ఉగ్రవాదంపై పోరులో భారత్ కు**

# యూఏఈ, జపాన్ మద్దతు

**ఆపరేషన్ సిందూర్ పై అఖిలపక్షం వివరణలు**



న్యూఢిల్లీ : ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్, దానిని మన దేశంపైకి ఎగదోస్తున్న తీరును ప్రపంచ దేశాల దృష్టికి తీసుకువెళ్లేందుకు అఖిలపక్ష బృందాలను మన ప్రభుత్వం విదేశాలకు పంపించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ , జపాన్కు వెళ్లిన బృందాలు.. పాక్ దుశ్చర్యలు, భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పై ఆయా దేశాల నాయకులకు వివరించే పనిలో నిమగ్నమయ్యాయి. ఈ క్రమంలో వారి నుంచి భారత్కు పూర్తి మద్దతు లభిస్తున్నట్లు అక్కడున్న మన రాయబార కార్యాలయాలు వెల్లడిస్తున్నాయి.


శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే నేతృత్వంలోని అఖిలపక్ష బృందం యూఏఈలో పర్యటిస్తోంది. ఈ క్రమంలో అక్కడి మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ప్రముఖులు, మేధావులతో భేటీ అవుతోంది. ఇప్పటికే రెండు కీలక సమావేశాల్లో పాల్గొంది. ఈ సందర్భంగా పాక్ నుంచి ఎదురవుతున్న ఉగ్ర ముప్పు, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలను వారికి మన బృందం వివరించింది. ఈ క్రమంలో భారత్ చేపట్టిన దౌత్యపరమైన కార్యక్రమానికి పూర్తి మద్దతు ప్రకటించిన యూఏఈ అధికారులు.. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా రూపుమాపాల్సిందేనని ఉద్ఘాటించారు.

జేడీయూ ఎంపీ సంజయ్ ఝా సారథ్యంలో జపాన్లో పర్యటిస్తోన్న అఖిల పక్ష బృందం కూడా అక్కడి నేతలతో వరుస భేటీలు నిర్వహిస్తోంది. జపాన్ విదేశాంగ మంత్రి తకేషి ఇవాయా మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తీసుకున్న చర్యలను ప్రశంసించారు. ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడే వారిని శిక్షించాల్సిందేనన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్కు అండగా జపాన్ నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# అణచివేతకు గురైన చోటే పోరాడాలి

**ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులతో రాహుల్ ముఖాముఖీ**

**పలువురు విద్యార్థులతో విద్యా సమస్యలపై చర్చ**



ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీ యూనివర్సిటీని సందర్శించి విద్యార్థులతో ముఖాముఖీలో మాట్లాడారు. యూనివర్సిటీ నార్త్ క్యాంపస్లో పలువురు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులతో విద్యాపరమైన సమస్యలపై ఆయన చర్చించారు. విద్యార్థులు అన్నింటా ప్రాతినిధ్యం, సమానత్వం, విద్యాపరమైన న్యాయం వంటి పలు అంశాలపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా లోక్సభలో ప్రతిపక్షనేత సూచించారు. ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో విద్యార్థులు హాజరై తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల భాగస్వామ్యం, సమ్మిళిత విద్యాసంస్థల ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా చర్చించినట్లు తెలుస్తోంది. అధ్యాపక పదవుల్లో బడుగు వర్గాల ప్రాతినిధ్యం లేకపోవడంపై ఈ సందర్భంగా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత పదవుల నియామకాలల్లో కూడా తమ వర్గాలపై చిన్నచూపు ఉందని వారు కాంగ్రెస్ నేతకు తెలిపారు. జాతీయ విద్యా విధానం కింద నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో కూడా అసమానతలు ఉన్నాయన్నారు. విద్యాపరంగా తమకు సరైన వసతులు కల్పించడం లేదని, గైర్హాజరు స్థితిగతులపై మార్కింగ్ చేపట్టకుండా అన్యాయం చేస్తున్నారన్నారు.

అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "విద్యార్థులు డా. బీఆర్ అంబేద్కర్ సందేశాన్ని తప్పకుండా ఆచరించాలి.. విద్యార్థులు "చదవాలి, నిలదీయాలి, వ్యవస్థీకరించాలి". న్యాయమైన, సమగ్ర విద్యా పర్యావరణ వ్యవస్థను సృష్టించడంలో స్టూడెంట్స్ కీలక పాత్ర పోషించాలి. విద్యార్థుల పాత్ర తరగతి గదులకు బయట కూడా ఉండాలి. అణచివేతకు గురైన, ప్రాతినిధ్యం తక్కువైన చోట హక్కుల కోసం పోరాడాలి" అని కాంగ్రెస్ నేత వ్యాఖ్యానించారు.

కాగా.. విద్యార్థులకు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చినందుకు వర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రౌణాక్ ఖాత్రీ రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

సూర్య
విజయవాడ
శుక్రవారం
23 మే 2025



# రైల్వే అభివృద్ధికి సహకరించండి

## కేంద్ర ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో పరుగులు పెడుతున్న అభివృద్ధికి అనుగుణంగా రైల్వే వ్యవస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పునరాభివృద్ధి చెందిన వరంగల్ రైల్వే స్టేషన్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా "వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యమం" ద్వారా ప్రారంభమైన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ పథకం ద్వారా తెలంగాణలోని మూడు రైల్వే స్టేషన్లను ఎంపిక చేసి ఈ రోజు వరంగల్ రైల్వే స్టేషన్ ను దేశంలోని 103 రైల్వే స్టేషన్లతో పాటు వర్చువల్ గా ప్రారంభిస్తున్న ప్రధాన మంత్రి మోదీకి అభినందనలు తెలియజేశారు. ప్రపంచంలోని ముఖ్య నగరాలకు ధీటుగా హైదరాబాద్ మహానగరం అభివృద్ధి చెందుతుంది. వరంగల్ జిల్లాను కూడా అలా అభివృద్ధి చేయాలన్నదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇటు సౌత్ సెంట్రల్ రైల్వేకి, అటు నార్త్ సెంట్రల్ రైల్వేకి మధ్యగా ఉన్న కాజీపేట రైల్వే స్టేషన్ ను డివిజన్ గా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. రూ. 24,500 కోట్ల వ్యయంతో 76 కిలోమీటర్ల పరిధిలో రెండో విడత హైదరాబాద్ మెట్రో నిర్మాణ పనులను చేపట్టేందుకు వీలైనంత త్వరగా అనుమతులతో పాటు నిధులను విడుదల చేయాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్కు సమాంతరంగా రైల్వేలైన్ మంజూరు చేయాలని కోరారు. వికారాబాద్ - కృష్ణా మధ్య రైల్వేలైన్, కల్వకుర్తి - మాచర్ల రైలు మార్గాన్ని మంజూరు చేయాలని డోర్నకల్ - మిర్యాలగూడ (పాపటపల్లి- జాన్ పహాడ్),డోర్నకల్ - గద్వాల ప్రతిపాదిత రైలు మార్గాలను పున:పరిశీలించాలని కోరారు.



# రేవంత్ రెడ్డి ఒక అపరిచితుడు



### కాళేశ్వరంలో మిస్ వరల్డ్ బ్యూటీస్ - అదే కాళేశ్వరం మీద నోటీసులు
### పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై చేసిన దుష్ప్రచారం తేలిపోయింది
### సుప్రీంకోర్టు సాక్షిగా నిజాలు బయటకు వచ్చాయి - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ బ్యూరోప్రతినిధిః పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై చేసిన దుష్ప్రచారం తేలిపోయిందని, సుప్రీంకోర్టు సాక్షిగా నిజాలు బయటకు వచ్చాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి కాళేశ్వరంపై చేస్తున్న దుష్ప్రచారం కూడా త్వరలో తేలిపోతుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నికృష్టమైన, నీఛమైన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణలో భవన్లో మీడియా ప్రతినిధులతో కేటీఆర్ చిట్చాట్ చేశారు. 'ప్రజాపాలన పర్సంటేజీ పాలనగా మారిందని, దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ నోటీసులు. కాంగ్రెస్ పార్టీ కమిషన్లు బయటపడుతున్నాయని తెలిశాకే.. ఇప్పుడు నోటీసుల పేరిట తమాషాలు. సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై వ్యాఖ్యానించింది. జస్టిస్ గోష్ తన నివేదిక పూర్తయిందని, విచారణ పూర్తయిందన్నారు. అయితే కమిషన్ గడువు మళ్లీ ఎందుకు పొడిగించారో ప్రభుత్వం చెప్పాలి. కాళేశ్వరం నోటీసులు ఇప్పటిదాకా నేరుగా అందినట్టు సమాచారం లేదు. అందిన తర్వాత ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటాం. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని బ్యారేజీలను కూలగొట్టి మళ్లీ టెండర్ల పిలిచి, 20 నుంచి 30 శాతం కమిషన్లు తీసుకోవాలన్నదే అసలు ఏజెండా. సుప్రీంకోర్టుకు కాళేశ్వరం ప్రాధాన్యత, గొప్పతనం అర్థమైంది. సెంట్రల్ వాటర్ కమిషన్కు అర్థమైంది, అందుకే 'ఇరిగేషన్ మార్వెల్' అన్నారు. న్యాయమూర్తులకు అర్థమవుతుంది, కానీ ఇక్కడ అధికారంలో ఉన్న అజ్ఞాని ముఖ్యమంత్రికి అర్థమవడం లేదు. పాలమూరు-రంగారెడ్డిపై ముఖ్యమంత్రి చేసిన కుట్రలు విఫలమయ్యాయి. పాలమూరు-రంగారెడ్డిని వెంటనే పూర్తిచేసి మహబూబ్నగర్ ప్రజలకు సాగునీరు ఇవ్వాలని ప్రజల తరపున డిమాండ్ చేస్తున్నాం.

పాలమూరు బిడ్డను అని చెప్పుకున్న రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును ఎందుకు పక్కన పెట్టారు?. పాలమూరులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పినట్టే, కాళేశ్వరంపైన కూడా స్పష్టమైన తీర్పులు వస్తాయి. కాళేశ్వరం ప్రాధాన్యతను ప్రజలకు, ఈ మూర కాంగ్రెస్ నాయకులకు అర్థమయ్యేలా చెబుతాయి. 580 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, ముఖ్యమంత్రి అందాల పోటీలో ఉండడం కరెక్టా?. అన్నదాతల ధాన్యం వర్షంలో కొట్టుకుపోతుంటే, అందాల పోటీలకు రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో అతిపెద్ద ప్రమాదం జరిగితే ఒక్కసారి పోనీ రేవంత్ రెడ్డి అందాల పోటీలకు నాలుగు సార్లు పోయాడు. రాష్ట్ర ప్రభుత్వ దగ్గర ఒక రూపాయి కూడా లేదు అని చెప్పి, అందరూ దొంగల్లా చూస్తున్నారంటూ.. రూ.200 కోట్లు అందాల పోటీలకు ఖర్చు పెట్టడం కరెక్టా?. మిస్ వరల్డ్ కాంటెస్టులకు మంత్రులంతా టూర్ గైడ్లుగా మారిపోయారు. మంత్రులు సొంగ కార్చుకుంటూ అందాల పోటీలో పాల్గొంటున్నారని సీపీఐ నారాయణ అన్నారు. మిస్ వరల్డ్ బ్యూటీస్.. కాళేశ్వరం మీద నోటీసులు.. ఇదే రేవంత్ రాజకీయం. మిస్ వరల్డ్ బ్యూటీస్కి కూడా రేవంత్ రెడ్డి చూపిస్తున్నది అంతా తమ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులు మాత్రమే. నిజాం కట్టిన చార్మినార్ లేదా కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులు తప్ప, కాంగ్రెస్ పార్టీ కట్టిన ఒక్కదానినైనా రేవంత్ రెడ్డి చూపించగలడా?. కాళేశ్వరంలోని రెండు పిల్లర్లకు ఇంత రాద్ధాంతం చేస్తున్న కాంగ్రెస్, ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై ఏం చేసింది?. మూడు నెలల తర్వాత కూడా అందులో చిక్కుకున్న వారిని బయటకు తీయలేకపోయారు. కమీషన్ల కోసం ఎస్ఎల్బీసీని హడావిడిగా మొదలుపెట్టారు. రేవంత్ రెడ్డి భాషలో చెప్పాలంటే, మగోడు అయితే ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటకు తీసేవాడు. ఇదే విధంగా కాళేశ్వరం విషయంలో కూడా దాని ప్రాధాన్యత బయటకు వస్తుంది. మరొక రోజు కేసీఆర్ కట్టిన ప్రతిదీ తిరిగి చూపిస్తారు

# భారీ వర్షాలపై సిఎస్ సమీక్ష

హైదరాబాద్ : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు గురువారం జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షపాతం కారణంగా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రీమాన్సూన్ యాక్షన్ ప్లాన్లో భాగంగా ధాన్యం, పత్తి కొనుగోలు, పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఇతర వ్యవసాయ కార్యకలాపాల పై సమీక్షించారు. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులను రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్మెంట్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ కలెక్టర్లకు వివరించారు. రాబోయే మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. తదుపరి పదిహేను రోజులు జిల్లాలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు విషయంలో, కలెక్టర్లకు ఎస్.ఓ.పి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్) ఖచ్చితంగా అనుసరించాలని, అనూహ్య వర్షాల వల్ల ధాన్యానికి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సి.ఎస్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో సరిపడిన పరిమాణంలో డిఏపీ, కాంప్లెక్సులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సి.ఎస్ తెలియజేశారు. నకిలీ పత్తి విత్తనాల ముప్పును అరికట్టేందుకు జిల్లా స్థాయి, మండల స్థాయి, టాస్క్ ఫోర్స్ సమావేశాలు వెంటనే నిర్వహించాలని సి.ఎస్ ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయం, సరఫరా కు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రులతో కలసి ప్రెస్ మీట్ నిర్వహించి భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన ముందు జాగ్రత్త చర్యల వివరాలను ప్రజలకు తెలియచేయాలని కలెక్టర్లకు సూచించారు.

జిహెచ్ఎంసి పరిధిలో తెరచి ఉన్న నాలాలు, మాన్హోల్స్ మూసి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాల కారణంగా నగరంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు.

### సజ్జల సామ్రాజ్యంపై
# కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి



వైసీపీ కీలక నేత, గత ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సామ్రాజ్యంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. కడప నగరశివారుల్లో ఉన్న సజ్జల ఎస్టేట్లో సజ్జల కుటుంబ సభ్యులు ఆక్రమించిన భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీకే దిన్నె మండల పరిధిలోని సజ్జల ఎస్టేట్లో అక్రమణకు గురైన 63.72 ఎకరాల ప్రభుత్వ భూములను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమించిన భూముల్లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే, ఆక్రమించిన భూముల్లో అటవీ భూములు 52 ఎకరాలు, మిగిలినవి అసైన్డ్ భూములు మొత్తం 220 కోట్లు విలువ చేసే భూములను ఆక్రమించి వివిధ రకాల పండ్ల తోటలను సజ్జల కుటుంబం సాగు చేసినట్లు తెలుస్తోంది. కాగా, సజ్జల రామకృష్ణారెడ్డి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఆయన అధికారంలో ఉన్నప్పుడు తన కుటుంబ సభ్యులు ప్రభుత్వ భూములను ఆక్రమించారని గుర్తించిన అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

### ఏపీ పీఎస్సీ అక్రమాల కేసులో
# ఆంజనేయులు మళ్ళీ జైలుకు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి

ఏపీపీఎస్సీ అక్రమాల కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులును పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. ఏపీపీఎస్సీ అక్రమాల కేసులో పీఎస్సార్ ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో నేటితో రిమాండ్ ముగియడంతో ఆయనను కోర్టులో హాజరుపర్చగా.. జూన్ 5 వరకు రిమాండ్ను పొడిగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు పీఎస్సార్, ధాత్రి మధును ఏడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టులో సీఐడీ దాఖలు చేసిన పిటిషన్పై విచారణ జరిగింది. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను రేపటికి (శుక్రవారం) వాయిదా వేసింది. కాగా.. ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలలో పేపర్ మూల్యాంకనంలో అవకతవలకు సంబంధించిన కేసులో పీఎస్సార్పై పోలీసులు పీటీ వారంట్పై అదుపులోకి తీసుకుని కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. 2018-2019 మధ్యకాలంలో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా పీఎస్సార్ పనిచేసినప్పుడు గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీ అవకతవకలు జరిగాయని, నిధులు దుర్వినియోగం అయ్యాయని తీవ్ర ఆరోపణలు వచ్చాయి. దీంతో ఏప్రిల్ 29న పీఎస్సార్పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పీఎస్సార్ ఏ1గా, ధాత్రి మధు ఏ2గా ఉన్నారు. ఈ కేసులో పీఎస్సార్ను తొలుత కోర్టులో హాజరుపర్చగా నేటి వరకు రిమాండ్ విధించింది. ఈరోజుతో రిమాండ్ ముగియడంతో మరోసారి ఆయనను కోర్టులో హాజరుపర్చగా... మరోసారి ఆయన రిమాండ్ను పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కాగా.. ఈ కేసులో బెయిల్ ఇవ్వాల్సిందిగా విజయవాడ కోర్టులో పీఎస్సార్ పిటిషన్ వేయగా.. అందుకు న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

# జగన్ రెడ్డికి సోమిరెడ్డి సవాల్

### ఉర్సాకు రూపాయికే భూమిని కేటాయిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న సోమిరెడ్డి
### లేకుంటే అబద్ధాలను ప్రచారం చేయిస్తున్న జగన్ రెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి



జగన్ వాగ్లాడిన దాంట్లో ఒక్కటి నిజం లేదు. అన్ని అబద్ధాలే. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ నివేదిక ప్రకారం ఏపీ 8.21% గ్రోత్ రేటుతో ఇండియాలో రెండో స్థానంలో ఉంది. 9.69% గ్రోత్ రేటుతో తమిళనాడు మొదటి స్థానంలో ఉంది. 11 నెలల్లో ఏపీ సాధించిన విజయం ఇది. జగన్ రెడ్డి గ్రోత్ రేటు ఘోరంగా పడిపోయిందని పచ్చి అబద్ధాలు మాట్లాడటం దారుణం. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా దిగజారి మాట్లాడటం సిగ్గుచేటు. ఐదేళ్ల విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని జగన్ రెడ్డి సర్వనాశనం చేశాడు. మద్యపాన నిషేధం అని చెప్పి కల్తీ మద్యం అమ్మి ప్రజల ప్రాణాలు తీశాడు. మద్యాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి ప్రజలపై భారాలు మోపాడు. ఆ అప్పులకు వడ్డీలను నేడు కూటమి ప్రభుత్వం కడుతోంది. కూటమి పాలనలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ బోర్డు ఆరు సార్లు సమావేశమైన ఫలితంగా రూ. 4,95,000 కోట్ల పెట్టుబడులతో 4,55,000 ఉద్యోగాలు వస్తున్నాయి. ఇది %టా్ఖాదీ%లో అంగీకరించబడ్డాయి. మొత్తం రూ. 6 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా అందులో రూ.3,19,000 కోట్లు రాయలసీమలో వస్తున్నాయి. ఇవి జగన్కు కనిపించవా? అసలు పరిశ్రమల రాక జగన్కు ఇష్టం లేదు. మంచి కంపెనీలకు భూములు ఉచితంగా ఇచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కానీ జగన్ 99 పైసలు, రూపాయి, ఇడ్లీ వడ రేటుకే ఉర్సాకు భూములు ఇచ్చారని కారుకూతలు కూస్తున్నాడు. విశాఖ ఐటీ పార్క్ లో 3.5 ఎకరాలు ఎకరా రూ. 1 కోటి చొప్పున అలాగే మరోచోట 56.30 ఎకరాలు రూ. 50 లక్షల చొప్పున ఉర్సాకు కేటాయించారు. ఇది తెలుసుకోకుండా.. బెంగళూరు యలహంకలో విశ్రాంతి తీసుకుంటూ.. అప్పుడప్పుడు ఏపీకి వచ్చి సొల్లు కబుర్లు చెప్పి జగన్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నాడు..ఇడ్లీ వడ రేటుకు ఉర్సాకు భూములు ఇస్తే నేను సర్వేపల్లి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. అది నిజం కాకపోతే జగన్ రెడ్డి యలహంక నుండి వచ్చి పులివెందుల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. వ్యవస్థలను సర్వనాశనం చేసి, పంచాయతీరాజ్ను భ్రష్టుపట్టించిన జనగ్ రెడ్డి ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత ఉందా? 14, 15 ఫైనాన్స్ కమిషన్, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, కేంద్ర నిధులను దారిమళ్లించి, దోచుకుని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. మద్యం అక్రమాల్లో దోషులు కటకటాల పాలవుతుంటే జగన్కు నిద్ర పట్టడం లేదు. జగన్ పాలనలో కల్తీ మద్యం తాగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అబద్ధాలను పదే పదే చెప్పి ప్రజలు నమ్ముతారనుకోవడం జగన్ పిచ్చితనం. వ్యవస్థలను తాకట్టు పెట్టిన జగన్ నీతి సూత్రాలు చెబుతుంటే వినలేకపోతున్నాం. 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన మీకు ఇప్పుడు విద్యుత్ గురించి మాట్లాడే అర్హత ఎక్కడిది? కొనసాగించి ఉంటే రెండేళ్లలో పూర్తి కావాల్సిన అమరావతిని ఆపేశారు. జగన్ రెడ్డి తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఓబులాపురం స్కాం జరిగింది. నేడు శిక్ష అనుభవిస్తున్నారు. తప్పు చేసినవారు శిక్ష అనుభవించక తప్పదు. 2014-19లో ఇరిగేషన్లో రూ.63,000 కోట్లు మేము ఖర్చు చేస్తే.. జగన్ రెడ్డి కేవలం రూ. 23,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశాడు. అన్ని వ్యవస్థలను నాశనం చేశాడు. కేంద్ర స్కీమ్లను మూసేసి రైతులను కూడా తీవ్ర నష్టపరిచాడు. నేడు సిగ్గులేకుండా గంటలు గంటలు అబద్ధాలు మాట్లాడుతున్నాడు. అని సోమిరెడ్డి అన్నారు.

### సాఫ్ట్వేర్ ఇంజనీర్లకు
# కష్టకాలం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి

ఒకప్పుడు సాఫ్ట్వేర్ ఇంజనీర్ అని కాలర్ ఎగరేసి చెప్పుకునే రోజులు ఉండేవి. డాక్టర్లు, టీచర్లు ఇంకెవరైనా సరే, సాఫ్ట్వేర్ ఇంజనీర్ల ముందు కొంచెం తక్కువే అనే భావన ఉండేది. ఇంజనీరింగ్ చదవకపోయినా లక్షల్లో జీతాలు సంపాదించే అదృష్టం ఈ రంగానికే దక్కింది. దీంతో చాలామంది హైలైఫ్ అలవాటు పడ్డారు. కానీ, ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా. "పెరుగుట విరుగుట కొరకే" అన్నట్టుగా ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. ఎక్కువ జీతాలు తీసుకుంటున్నామని సంబరపడకండి. ఉద్యోగాలు ఊడిపోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాఫ్ట్వేర్ ఇంజనీర్ల భవిష్యత్తు ఏమవుతుందో చూద్దాం!

సాఫ్ట్వేర్ ఇంజనీర్లు ఇప్పుడు అనుభవిస్తున్న భారీ జీతాలు శాశ్వతం కాదని జోహో సీఈవో శ్రీధర్ వెంబు కుండబద్దలు కొట్టారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ( , లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ వంటి టెక్నాలజీలు సాఫ్ట్వేర్ ఉద్యోగాలను గణనీయంగా తగ్గిస్తున్నాయని ఆయన తేల్చి చెప్పారు. సాఫ్ట్వేర్ ఇంజనీర్లు మెకానికల్, సివిల్ ఇంజనీర్లు, కెమిస్టులు, టీచర్ల కంటే ఎక్కువ జీతం పొందడం అనేది వారికి ప్రత్యేకంగా వచ్చిన హక్కు ఏమీ కాదని, అది ఎప్పటికీ ఇలాగే ఉంటుందని అనుకోకూడదని ఆయన సూచించారు. ఏఐ, అడ్వాన్స్డ్ టూల్స్ రాకతో సాఫ్ట్వేర్ డెవలప్మెంట్లో విప్లవం వస్తోంది. ఇది చాలా మంది ఉద్యోగాలను తీసేస్తుంది. గత ఏడాది ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ రిపోర్ట్ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 40 శాతం ఉద్యోగాలపై ఏఐ ప్రభావం ఉంటుందని తేలింది. కానీ, అభివృద్ధి చెందిన దేశాల్లో అయితే ఈ ప్రభావం ఏకంగా 60 శాతం వరకు ఉంటుందని సాఫ్ట్వేర్ రంగంలోని కొత్త నిపుణులు భయపడుతున్నారు. ఈ మార్పులను అర్థం చేసుకుని, తమను తాము మార్చుకున్న వారికే భవిష్యత్తు ఉంటుందని వారు అంటున్నారు. ఒకప్పుడు ఇంటెల్ మాజీ సీఈవో ఆండీ గ్రోవ్ అన్నట్టు భయపడేవాళ్లే బతుకుతారు అనేది ఇప్పుడు నిజమవుతోంది. ఇటీవల గూగుల్, మెటా లాంటి పెద్ద కంపెనీలు ఏఐ తో కోడ్ రాసుకునే టెక్నాలజీని కనిపెట్టాయి. దీంతో ఆయా కంపెనీలు ఎక్కువ జీతాలు తీసుకునే సాఫ్ట్వేర్ ఇంజనీర్లను పెద్ద మొత్తంలో తీసేస్తున్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగాల కోత ఉంటుందని ఈ పెద్ద కంపెనీలు ఇప్పటికే ప్రకటించాయి. ఇదంతా కేవలం ఏఐ , అడ్వాన్స్డ్ టూల్స్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ వల్లే జరుగుతోంది. ముందు ముందు ఇది మరింత తీవ్రంగా ఉండబోతోంది. సాఫ్ట్వేర్ ఇంజనీర్లు అలర్ట్ కావాల్సిందే. ఇప్పటివరకు "అబ్బో సాఫ్ట్వేర్ ఇంజనీర్" అనుకున్నవాళ్లు రేపు "పాపం" అనే పరిస్థితికి వచ్చినా ఆశ్చర్య పోనవసరం లేదు.

# విశాఖలో 'కూటమి'కి బీటలు

- పార్టీ ఇన్చార్జిలు, ఎమ్మెల్యేల మధ్య భగ్గుమన్న విభేదాలు
- టిడిపి జనసేన మధ్య పెరిగిన అంతరాలు
- కార్యకర్తలకు విలువ ఇవ్వని టిడిపి నేతలు
- అధికారంలో ఉన్నా పనులు జరగట్లేదంటున్న శ్రేణులు
- కార్యకర్తలకు మింగుడు పడని రాష్ట్ర అధ్యక్షుని ఒంటెద్దు పోకడలు
- ఇంత జరుగుతున్నా పట్టించుకోని కూటమి అధినేతలు


విశాఖపట్నం, రీజనల్ బ్యూరో చీఫ్: తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడి సంవత్సర కాలం అవుతోంది. రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకున్నామన్న ఆనందం కూటమిలో ఎంతో కాలం లేదు. అప్పుడే ఈ మూడు పార్టీల మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయి. అంతేకాదు కూటమి బీటలువారడం మొదలైంది. పార్టీ నాయకులలో అసంతృప్తి, నాయకుల మధ్య విభేదాలు విశాఖ వేదికగా బహిర్గతం అవుతున్నాయి. టిడిపి, జనసేన నాయకుల మాటలు యుద్ధం పార్టీల మధ్య అగాధాన్ని మరింత పెంచింది.

విశాఖ డిప్యూటీ మేయర్ ఎన్నికల సమయంలో టిడిపి సమన్వయలోపం బయటపడడమే కాదు ఆ పార్టీకి పరువును పోగొట్టుకుంది. జీవీఎంసీలో డిప్యూటీ మేయర్ పదవికి అభ్యర్థి ఎంపిక విషయంలో టిడిపి జనసేన మధ్య తలెత్తిన విభేదాలు ఎన్నికను ఒకరోజు పాటు వాయిదా వేసేదాకా తీసుకొచ్చింది. మొదటి రోజు సమావేశానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరు కాలేదు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సైతం సమావేశానికి ఆలస్యంగా రావడమే కాకుండా, తన నియోజకవర్గంలోని టిడిపి కార్పొరేటర్లకు సమన్వయపరచుకోలేకపోయారు. రెండో రోజు జరిగిన సమావేశానికి అందర్నీ రప్పించారు. అయితే ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా టీడీపీ అభ్యర్థిని బరిలోకి దింపాలనుకున్నారు. అయితే అకస్మాత్తుగా ఒక సీల్డ్ కవర్ ఎన్నిక జరుగుతున్న ప్రాంగణానికి చేరుకుంది. కవర్ తెరిచి చూడగా జనసేన కార్పొరేటర్ దల్లి గోవిందరాజు పేరు బహిర్గతం కావడంతో టిడిపి అవాక్కయింది. అసలు తన పేరు రేసులో ఉందని కూడా తనకు తెలియదంటూ గోవిందరాజు చెప్పటం కొసమెరుపు. డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు ఇస్తున్నట్టు టిడిపి అధిష్టానం కానీ, రాష్ట్ర అధ్యక్షుడు కానీ పార్టీ శ్రేణులకు ముందుగా తెలియ తెలియజేయకపోవడం అత్యంత ఆశ్చర్యకరమైన విషయం. ఊహించని విధంగా డిప్యూటీ మేయర్ పదవిని జనసేన తన్నుకు పోవడం టిడిపి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. దీంతో ఈ రెండు పార్టీల మధ్య విభేదాలు మరింత పెరిగాయి.

జనసేన పార్టీ నాయకులకు అధిష్టానం ఇస్తున్న ప్రాధాన్యత టిడిపి తమకు ఇవ్వడం లేదంటూ టిడిపి నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక సమయంలో తాము బలపరిచిన అభ్యర్థులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోపోవడం పట్ల ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. అంతేకాదు ఈ వ్యవహారం కార్పొరేటర్లకు, ఎమ్మెల్యేలకు మధ్య మనస్పర్ధలను మరింత మరింత పెంచింది.

ఇదిలా ఉండగా జీవీఎంసీ పరిధిలో ఉన్న ఫుడ్ కోర్ట్ ను తొలగించాలని టిడిపి కార్పొరేటర్లు చాలాకాలంగా పట్టుబడుతున్నారు. అయితే జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దీనిని తొలగించడానికి అడ్డుపడుతున్నారు. దీన్ని తెలుగుదేశం పార్టీ పరువు ప్రతిష్టల విషయంగా పరిగణిస్తోంది.ఇది జరిగిన రెండు మూడు రోజుల్లోనే, వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయంలో ఒక సమావేశానికి హాజరైన టిడిపి, జనసేన ఎమ్మెల్యేలు, ఇన్చార్జిల మధ్య జరిగిన ఘర్షణ అధికారులను, ఆ సమావేశాన్ని ఏర్పాటు చేసిన మంత్రి నారాయణని సైతం ఆశ్చర్యపోయేలా చేశాయి. నువ్వెంత అంటే నువ్వు ఎంత అన్న స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. ఆ వాతావరణం చూసి ఇదే సమావేశానికి హాజరైన శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వీరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడ నుంచి బయటకు వెళ్ళిపోయారు అంటే పార్టీల మధ్య వివాదాలు ఏ స్థాయికి చేరుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ పోరు మరింత పెరిగి పార్టీ అధిష్టానాల వద్ద పంచాయతీకి వెళ్లే అవకాశం కూడా లేకపోలేదు.

**అసలేం జరిగింది? ఏం జరుగుతోంది**విశాఖ జిల్లాలో ఎమ్మెల్యేలంతా ఒకటైపోయి ఇన్చార్జిలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. జిల్లాలోని అభివృద్ధి పనుల విషయంలో ఎమ్మెల్యేలు, ఇన్చార్జిలు అలాగే టీడీపీ, జనసేన నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. దీంతో ఎవరు చెప్పిన పనులు చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.ఇదిలా ఉండగా తమకు తెలియకుండానే నామినేట్ పదవులను అధిష్టానం భర్తీ చేస్తుందని ఎమ్మెల్యేలు వాపోతున్నారు.ఇదిలా ఉండగా డిసిసిబి ఛైర్మన్గా జనసేనకు చెందిన కోన తాతారావును నియమిస్తున్న విషయం జిల్లాలోని టిడిపి నాయకులకు పార్టీ




అధిష్టానం తెలియపరచకపోవడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? అలాగే భీమిలి నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ అధ్యక్షులను అధిష్టానం నియమించింది. ఈ సమాచారం ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే గంటాకు కూడా తెలియలేదట! అలాగే భీమిలి నియోజకవర్గంలో ఉన్న వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ క్లబ్ లో ఉత్తర నియోజకవర్గానికి చెందిన బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు జోక్యం చేసుకోవడం పట్ల ఎమ్మెల్యే గంటా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వీరిద్దరి మధ్య మాటలు యుద్ధం కూడా జరిగింది.టిడిపి బలాన్ని తగ్గిస్తూ, జనసేన తన బలాన్ని పెంచుకొని కూటమిలో నెంబర్ వన్ స్థానానికి వెళ్లే విధంగా వ్యవహారాలు నడుపుతోందని టిడిపి నేతలు భావిస్తున్నారు. జిల్లాలో అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు చేసే సిఫార్సులను పెద్దగా పట్టించుకోవడం లేదు., ఆ పార్టీ పెద్దల ఆదేశాల మేరకే అధికారులు పనిచేస్తున్నారట. అయితే జనసేన నాయకులు చేసే సిఫార్సులపై త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నారన్న ఆవేదన టిడిపి శ్రేణుల్లో బలంగా వినిపిస్తోంది. విశాఖలో కూటమి పార్టీల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నప్పటికీ టిడిపి జనసేన,అధిష్టానాలు వీటి పట్ల దృష్టి సారించకపోవడం గమనార్హం.ఏది ఏమైనా విశాఖలో ప్రారంభమైన ఈ కూటమి బీటలు రాష్ట్రమంతా విస్తరించే పరిస్థితి రాకుండా టిడిపి, జనసేన అధిష్టానం ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందో.. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా ఎలా సమన్వయ పరచు కుంటారో వేచి చూడాలి.

సూర్య
విజయవాడ
శుక్రవారం
23 మే 2025
8
suryachitramagazine@gmail.com
సూర్య సినిమా

## మే 23న 'ఏస్' అందరూ చూసి సక్సెస్ చేయండి- విజయ్ సేతుపతి




వెర్సటైల్ యాక్టర్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా 'ఏస్' అనే చిత్రం మే 23న ఆడియెన్స్ ముందుకు రానుంది. దర్శక, నిర్మాత అరుముగ కుమార్ ఈ మూవీని 7యాకర్స్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్ పై తెరకెక్కించారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతికి జోడిగా రుక్మిణి వసంత్ నటించారు. ఈ చిత్రాన్ని మే 23న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమాను శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్ మీద బి. శివ ప్రసాద్ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ సందడి చేసింది. ఈ ఈవెంట్‌లో... పద్మిణి సినిమాస్ అధినేత దర్శక, నిర్మాత బి. శివ ప్రసాద్ మాట్లాడుతూలి .. "ఏస్' సినిమా ఆల్రెడీ బ్లాక్ బస్టర్ హిట్ అయినట్టు కనిపిస్తోంది. అందరి మొహాల్లో సంతోషం ఉంది. ఈ కథ, కారెక్టర్స్ అన్నీ అద్భుతంగా ఉండబోతున్నాయి. విజయ్ సేతుపతి మళ్లీ అందరినీ ఆకట్టుకోబోతున్నారు. ఆయన చాలా మంచి వ్యక్తి. అన్నీ సెట్ అయితే 'రొమాంటిక్ డాన్' అనే సినిమాను ఆయనతో త్వరలోనే ప్రకటిస్తాను. 'ఏస్' సినిమాగానూ అందరికీ ముందుగానే కంగ్రాట్స్. మే 23న ఈ చిత్రం పెద్ద విజయం సాధించబోతోంది' అని అన్నారు. మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి మాట్లాడుతూలి .. 'అరుముగ కుమార్ నాకు చాలా ఏళ్ల నుంచి తెలుసు. నాకు సినిమాలో మొదటి చాన్స్ ఇచ్చింది కూడా ఆయనే. మళ్లీ ఇప్పుడు ఆయనతో పని చేస్తుండటం ఆనందంగా ఉంది. ఇందులో యాక్షన్, రొమాన్స్ అన్నీ అంశాలు ఉంటాయి. ఈ చిత్రంలో పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ మూవీ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. తెలుగు డబ్బింగ్ చాలా బాగా ఉంది. బి. శివ ప్రసాద్ మల్టీ టాలెంటెడ్. ఆయనకు ఆల్ ది బెస్ట్. మే 23న మా సినిమాను అందరూ చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు.

## కాన్స్‌లో లాంచ్ చేసిన 'విశ్వంభర' ఎక్స్‌క్లూజివ్ ఎపిక్ బుక్




మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ మూవీ 'విశ్వంభర' ఇప్పటికే నేషనల్ లెవల్ లో మంచి హైప్‌ను క్రియేట్ చేసింది. ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్, ఇతర ప్రమోషనల్ మేటీరియల్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యు.వి. క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. మెగా మాస్ ఇప్పుడు సరిహద్దులు దాటి గ్లోబల్‌గా మారింది. నిర్మాత విక్రమ్ రెడ్డి విశ్వంభరను అంతర్జాతీయ వేదిక అయిన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు తీసుకెళ్లారు. అక్కడ విశ్వంభర ఎక్స్‌క్లూజివ్ బుక్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఈవెంట్ లో ఆయన సినిమా కథ, భారతీయ పురాణాల ప్రాధాన్యత, బుక్ విశేషాలు గురించి వివరించారు. అలాగే సినిమా స్థాయి, విఎఫ్ఎక్స్ స్టూడియోల సహకారం గురించి కూడా చెప్పారు. టాప్ హాలీవుడ్ విఎఫ్ఎక్స్ స్టూడియోల భాగస్వామ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్, విఎఫ్ఎక్స్ పనులు ఇప్పటికే 90% పూర్తయ్యాయి. మిగతా పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు పూర్తయ్యాక, మేకర్స్ సినిమా విడుదల తేదీని భారీ ప్రమోషన్‌లతో ప్రకటించనున్నారు. అయితే #WhatIsInsideVishwambharaBook? అనేది ఇప్పుడు అందరి మనసుల్లో మెదులుతున్న ప్రశ్న.

## జూన్ 13న నెట్‌ఫ్లిక్స్‌లో 'రానా నాయుడు 2'




విక్టరీ వెంకటేష్, రానా దగ్గుబాటి నటించిన క్రేజీ వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. మొదటి సీజన్‌కు వచ్చిన అద్భుతమైన స్పందనతో రెండో సీజన్‌ను అంతకు మించి అనేలా రూపొందించారు. ఇక ఈ రెండో సీజన్‌కు ముహూర్తం ఫిక్స్ చేశారు. 2023లో నెట్‌ఫ్లిక్స్ ఇండియా యొక్క బ్రేక్‌అవుట్ హిట్‌లలో ఒకటిగా మారిన ఈ సిరీస్ ప్రస్తుతం రెండో సీజన్‌తో ఆడియెన్స్ ముందుకు రానుంది. సుందర్ ఆరోన్, లోకోమోటివ్ గ్లోబల్ నిర్మించిన ఈ సిరీస్‌ను కరణ్ అన్షుమాన్ క్రియేట్ చేశారు. కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ ఎస్. వర్మ, అభయ్ చోప్రా దర్శకత్వం వహించారు. 'రానా నాయుడు సీజన్ 2' జూన్ 13 నుంచి స్ట్రీమింగ్ కానుంది. రానా దగ్గుబాటి, వెంకటేష్ దగ్గుబాటి, అర్జున్ రాంపాల్, సుర్వీన్ చావ్లా, కృతి ఖర్బందా, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, డినో మోరియా వంటి అద్భుతమైన తారాగణంతో ఈ 'రానా నాయుడు' సీజన్ 2 రాబోతోంది. జూన్ 13న 'రానా నాయుడు 2'ని కేవలం నెట్‌ఫ్లిక్స్‌లో మాత్రమే చూడండి.

# క్రూషియల్ యాక్షన్ ప్యాక్డ్ షెడ్యూల్ 'పెద్ది'

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ పెద్ది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్ తో దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పవర్ ఫుల్ కొలాబరేషన్, అద్భుతమైన టీంతో 'పెద్ది' భారతీయ సినిమాలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ పాన్-ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో నిర్మిస్తున్న పెద్ది, లెన్తీ క్రూషియల్ షెడ్యూల్ హైదరాబాద్‌లోని మ్యాసీవ్ విలేజ్ సెట్‌లో ప్రారంభమౌతోంది. "పెద్ది" లోని రా అండ్ రస్టిక్ బ్యాక్ డ్రాప్, మూలకథను ప్రతిబిం బించేలా, ప్రేక్షకులకు ఓ ప్రత్యేక అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో టీం అద్భుతమైన వర్క్ చేస్తోంది. ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా నేతృత్వంలో మ్యాసీవ్ విలేజ్ సెట్ ని నిర్మించారు. ఇక్కడ భారీ యాక్షన్ సీక్వెన్స్, టాకీ పోర్షన్ ని చిత్రీకరించనున్నారు. ఇప్పటికే 30% షూటింగ్ పూర్తి కాగా, ప్రస్తుతం ప్రారంభమైన ఈ షెడ్యూల్ ద్వారా సినిమా ఓ కీలక దశను చేరుకోనుంది. "ఉప్పెన" విజయం తర్వాత బుచ్చి బాబు సానా మరింత ప్రెస్టీజియస్‌గా, ప్రతి విభాగాన్ని చాలా కేర్ తీసుకుంటూ గ్రాండ్ స్కేల్‌లో రూపొంది స్తున్నారు. ఈ సినిమాలో రామ్ చరణ్ రస్టిక్ అండ్ రగ్గడ్ లుక్ లో కనిపించనున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



## 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ జూన్‌లో ప్రారంభం



మోస్ట్ సక్సెస్ ఫుల్ కాంబినేషన్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్' జూన్ నుంచి రెగ్యులర్ షూట్ ప్రారంభం కానుంది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది కంప్లీట్ రీలోడెడ్, రీ ఇమాజిన్డ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

పవన్‌కల్యాణ్ పూర్తి స్థాయి కమర్షియల్ మాస్ అవతార్‌లో అలరించబోతున్నారు. ఇది అభిమానులకే కాదు, యావత్ ప్రేక్షకులకు హై-ఓక్టేన్ కథనంతో గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్నారు. ఆశుతోష్ రానా, నవాబ్ షా, 'కేజీఎఫ్' ఫేమ్ అవినాష్, గౌతమి, నాగ మహేశ్, టెంపర్ వంశీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు, యంగ్ డైనమైట్ ఉజ్వల్ కుల్కర్ణీ ఎడిటర్. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రాఫ్ చేస్తున్నారు. స్క్రీన్‌ప్లే క.దశరథ్, రమేష్ రెడ్డి అందిస్తున్నారు, ప్రవీణ్ వర్మ, చంద్రమోహన్ అడిషినల్ రైటర్స్. ప్రొడక్షన్ డిజైన్‌ను అవార్డ్ విన్నింగ్ ఆనంద్ సాయి అందిస్తున్నారు.

## 'ది ఫిక్సర్ ఈజ్ బ్యాక్ అయితే ఈసారి మాత్రం తన కోసమే'




హైదరాబాద్‌లో ప్రముఖమైన ప్రసాద్ సినిమాస్ దగ్గర అభిమానులు, ప్రేక్షకులు భారీగా హాజరయ్యారు. అందరిలో ఉత్సాహం ఉరకలేస్తుంది. ఈ ప్రత్యేకమైన వేడుకలకు విలక్షణ నటుడు రానా దగ్గుబాటి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. వెర్సటైల్, డైనమిక్ యాక్టర్ అర్జున్ రాంపాల్ కూడా ఈ వేడుకల్లో భాగమయ్యారు. నెట్‌ఫిక్స్‌లో సూపర్ హిట్ అయిన సిరీస్ రానానాయుడు సీజన్2 కోసం ఈ ఇద్దరు స్టార్స్ తమదైన స్టైల్‌లో ఎంట్రీ ఇచ్చేసి రానానాయుడు సీజన్2 భారీ పోస్టర్‌ను విడుదల చేశారు. రానా నాయుడు సీజన్2 కోసం ఫ్యాన్స్ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ సరికొత్త ఫస్ట్ లుక్‌ను విడుదల చేయటం విశేషం. జూన్13 నుంచి నెట్‌ఫ్లి క్స్‌లో స్ట్రీమింగ్. రానానాయుడు సీజన్2 కోసం ఫ్యాన్స్ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ సరికొత్త ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయటం విశేషం. జూన్13 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్న రానానాయుడు సీజన్2పై భారీ అంచనాలు నెలకొన్నాయి. 'సీజన్ వన్ కంటే సీజన్2 మరింత వైల్డ్‌గా ఉంటుంది' అని పేర్కొన్నారు రానా. 'ఈ సీజన్ మరింత పెద్ద దిగా, వ్యక్తిగతంగా ఉంటుంది. రానానాయుడు సీజన్2 కోసం మరోసారి టీమ్‌ను కలవటం చాలా ఆనందంగా ఉంది. పాత్రలు మరింత లోతుగా ఉంటాయి. అవన్నీ గందరగోళంగా అనిపిస్తాయి. అన్నీ విషయాల్లో హద్దులను మరింతగా పెంచాం. మీరు ఇష్టపడిన విషయాలను మరో లెవల్‌కు తీసుకెళ్లాం. మొదటి సీజన్‌కు అభిమానుల నుంచి గొప్ప స్పందన వచ్చింది. ఇప్పుడు సీజన్2కి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను అభిమానుల సమక్షంలో ఎక్స్‌క్లూజివ్‌గా విడుదల చేయటం ఆనందంగా ఉంది. నేను నేను రానా నాయుడుగా నటిస్తే, రవుఫ్ పాత్రలో అర్జున్ రాంపాల్ నటించారు.

## ఉత్తమ యోధుడిలా మోహన్‌లాల్



కంప్లీట్ యాక్టర్ మోహన్‌లాల్ పుట్టిన రోజు (మే 21) సందర్భంగా ఫ్యాన్స్‌కు మంచి ట్రీట్ ఇచ్చారు. మాలీవుడ్‌లోనే కాకుండా ప్యాన్ ఇండియా వైడ్‌గా వస్తున్న క్రేజీ ప్రాజెక్టుల్లో 'వృషభ' చిత్రం ఒకటి. అత్యంత భారీ బడ్జెట్‌తో రాబోతోన్న ఈ చిత్రం నుంచి మోహన్‌లాల్ బర్త్ డే సందర్భంగా అదిరిపోయే పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'వృషభ' నుంచి రిలీజ్ చేసిన ఈ మోషన్ పోస్టర్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. ఇందులో మోహన్‌లాల్ కనిపిం చిన తీరుకు అంతా ఫిదా అవుతున్నారు. మోహన్‌లాల్ ఆహార్యం, కనిపించిన విధానం, ఆ కత్తి పట్టుకున్న తీరు, జుట్టు ఎగురుతున్న స్టైల్ ఇవన్నీ చూస్తుంటే ఇందులో ఉత్తమ యోధుడిలా కనిపించబోతోన్నారనిపిస్తోంది. 'నా అభిమానులకు బర్త్ డే సంద ర్భంగా ఈ అప్‌డేట్‌ను అంకితం చేస్తున్నాను.. ఇకపై వారి ఎదురుచూపులకు తెర దించినట్టే.. అందరినీ కట్టి పడేసేలా, అందరినీ ఆకట్టుకునేలా 'వృషభ' చిత్రం ఉంటుంది' అని మోహన్‌లాల్ పోస్ట్ వేశారు. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిలిమ్స్ సమర్పణలో నంద కిషోర్ రచన, దర్శకత్వంలో 'వృషభ' రాబోతోంది. యాక్షన్, ఎమోషన్, పౌరాణిక గాథలను అద్భుతంగా మిళితం చేసి ఓ దృశ్య కావ్యంలా సినిమాను రూపొందిస్తున్నారు. మలయాళం, తెలుగులో ఏకకాలంలో చిత్రీకరిస్తున్న ఈ మూవీనీ అక్టోబర్ 16, 2025న తెలుగు, మలయాళం, హిందీ, తమిళం, కన్నడ అనే ఐదు భాషల్లో విడుదల చేయనున్నారు.

## 'థగ్ లైఫ్' షుగర్ బేబీ



యూనివర్సల్ హీరో కమల్ హాసన్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా "Thug Life"లోని మ్యూజికల్ యూనివర్స్ మరింత స్వీట్‌గా మారింది. మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా మూవీ సింగిల్ "షుగర్ బేబీ" రిలీజ్ అయ్యింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాట ఆడియన్స్ మనసుల్ని కొల్లగొట్టింది. స్లిజీ చార్మ్‌తో పాటు, అదిరిపోయే వైబ్‌తో ఈ పాట, రిథమ్, అటిట్యూడ్ బ్లెండ్ తో ఓ బోల్డ్ కాక్‌టెయిల్‌లా ఆకట్టుకుంటోంది. రెహమాన్ సంగీతం మ్యాజికల్‌గా వుంది. సాఫ్ట్, మెలోడిక్ బీట్స్ కట్టిపడేసింది. అలెగ్జాండ్రా జాయ్, శుభ, నకుల్ అభ్యం కర్ వోకల్స్ తో సాంగ్ ని మరింత లైవ్లీగా మార్చారు. ఒక్కో సింగర్ వారి స్వంత వాయిస్ టెక్స్చర్‌తో పాటకు ప్రత్యేక ఫ్లేవర్‌ను ఇచ్చారు. ఆనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం అదిరిపోయింది. లిరిక్స్ మనసులో నిలిచిపోయేలా వున్నాయి. త్రిషా కృష్ణన్ మెస్మరైజింగ్ బ్యూటీతో కనువిందు చేసింది. ఆమె లుక్స్, గ్రేస్, అన్నీ కలసి తెరపై మ్యాజిక్ ని సృష్టించాయి. రవికే చంద్రన్ అందించిన విజువల్ ఎస్తెటిక్ టచ్‌తో ప్రతి ఫ్రేమ్ విజువల్ ట్రీట్‌గా కనిపిస్తోంది.

## లవ్ రొమాంటిక్ థ్రిల్లర్‌గా "నిశ్శబ్ద ప్రేమ"

పలు సూపర్ హిట్ సినిమాలు, వెబ్ సిరీస్ లతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరో శ్రీరామ్. ఆయన నటించిన కొత్త సినిమా "నిశ్శబ్ద ప్రేమ". ఈ చిత్రంలో ప్రియాంక తిమ్మేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను సెలబ్రైట్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాత కార్తికేయన్.ఎస్ నిర్మించారు. లవ్ అండ్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా దర్శకుడు రాజ్‌దేవ్ రూపొందించారు. "నిశ్శబ్ద ప్రేమ" సినిమా ఈ నెల 23న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్, సాంగ్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్, డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్, నిర్మాత చింతపల్లి రామారావు నిర్మాత రాజేశ్ పుత్ర, డిస్ట్రిబ్యూటర్ సుబ్బారెడ్డి తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ ట్రైలర్ లాంఛ్ చేయగా, డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్ సాంగ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో శ్రీరామ్ మాట్లాడుతూ - "నిశ్శబ్ద ప్రేమ" సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌కు వచ్చి సపోర్ట్ చేస్తున్న ప్రసన్న కుమార్‌కి, వీరశంకర్‌కి, రామారావుకి ఇతర గెస్ట్‌లకు థ్యాంక్స్. లవ్ స్టోరీలో థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కలిపిన గ్రిప్పింగ్ మూవీ ఇది. ఏమాత్రం మిమ్మల్ని నిరాశపర్చదు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. ఇలాంటి టీమ్‌తో వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. తమిళంలో హిట్ అయిన తర్వాత కూడా ఎంతో ప్రయాసపడి తెలుగులోకి ఈ చిత్రాన్ని తీసుకొస్తున్నారు మా ప్రొడ్యూసర్, డైరెక్టర్. వారికి థ్యాంక్స్ చెబుతున్నా. మంచి సినిమాకు భాషా హద్దులు లేవు. ఏ భాషలోని సినిమా అయినా కంటెంట్ ఉంటే మరో చోట తప్పకుండా ఆదరణ పొందుతుంది. "నిశ్శబ్ద ప్రేమ" సినిమా సక్సెస్ మీద కూడా అలాంటి నమ్మకమే మా అందరికీ ఉంది అన్నారు.




## ధనుష్ టైటిల్ రోల్ లో 'కలాం'

### - కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో టైటిల్ పోస్టర్ ఆవిష్కరణ

జాతీయ అవార్డు గ్రహీత, మల్టీ టాలెంటెడ్ ధనుష్ మరోసారి తన నటనా ప్రతిభతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాడు. ఈసారి ధనుష్ భారతదేశ ప్రియతమ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ఆధారంగా రూపొందుతున్న ఒక భారీ బయోపిక్‌లో నటించనున్నాడు. ఈ సినిమా టైటిల్ పోస్టర్ ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆవిష్కరించబడింది. ఈ చిత్రానికి 'కలాం' అనే టైటిల్‌తో పాటు "ది మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా" అనే ట్యాగ్‌లైన్ ఫిక్స్ చేశారు. ఈ చిత్రాన్ని 'తానాజీ: ది అన్‌సంగ్ వారియర్', 'ఆదిపురుష్' లాంటి విజయవంతమైన చిత్రాల దర్శకుడు ఓం రౌత్ రూపొందిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌ను అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, మరియు టీ-సిరీస్ ఫిల్మ్స్ బ్యానర్ల కింద అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర, భూషణ్ కుమార్, కృషన్ కుమార్, గుల్షన్ కుమార్, తేజ్ నారాయణ్ అగర్వాల్, నిర్మిస్తున్నారు. డాక్టర్ కలాం జీవితం, భారత అంతరిక్ష, రక్షణ కార్యక్రమాలకు ఆయన చేసిన అమూల్యమైన సేవను ఈ చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆవిష్కరించిన 'కలాం' సినిమా టైటిల్ పోస్టర్ అందరినీ ఆకర్షించింది. డాక్టర్ కలాం యొక్క సిల్హౌట్‌తో పాటు, ఒక మిస్సైల్ చిత్రం ఆవిష్కరణాత్మకంగా రూపొందించబడింది, ఇది ఆయన భారత మిస్సైల్ టెక్నాలజీకి చేసిన కృషిని సూచిస్తుంది. భారతీయ సినిమాలో మోస్ట్ టాలెంటెడ్ నటులలో ఒకరిగా గుర్తింపు పొందిన ధనుష్, డాక్టర్ కలాం పాత్రను పోషించేందుకు చాలా ఫిజికల్ బాడీ ట్రాన్స్ ఫర్ మిషన్ అయ్యాడు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-